నేటి కందం- నేటికి అందం



కావించెద నే ప్రణతులు
శ్రీవారిని చూడగోరు చిరు భక్తులకున్
శ్రీవాణీ టిక్కెట్లను
పావనముగ నందజేయు ప్రథితాత్ములకున్ !!

(తిరుమలలో శ్రీవారి దర్శనానికి "శ్రీవాణీ టిక్కెట్లను ఈరోజు నుండి జారీ చేస్తున్నారు)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

నిన్న పార్టీ పిరాయిస్తే
నీతి విడిచి ఒప్పంటిరి
అందరిని మీలో చేర్చి
అనర్హతే కాదంటిరి.
నేడు అదే వీళ్లు జేస్తే
నిర్లజ్జగా తప్పంటిరి
అనర్హత వేటు కోరి
ఆగమై పోతుంటిరి

చురక



-వేల్పుల నారాయణ
9440433475

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 3-8-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి : 32 సంచిక : 1 పేజీలు:6 వెల: రూ.1/-


# నవభారత్ శత్రువులకు కాలభైరవుడు: ప్రధాని మోదీ



న్యూఢిల్లీ,ఆగష్టు 2:ఆధునిక భారత దేశం శత్రుదేశాలకు కాలభైరవుడు అవుతాడని ప్రధాని మోదీఅన్నారు. తన స్వంత నియోజకవర్గం వారణాసిలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ పాకిస్థాన్‌కు వార్నింగ్ ఇచ్చారు. భారత దేశ శత్రువులు భూగర్భంలో కూడా బ్రతికి ఉండరాదు అని అన్నారు. ఆపరేషన్ సింధూర్ సక్సెస్ గురించి ఆయన ప్రస్తావిస్తూ.. కాంగ్రెస్ పార్టీ వైఖరిని విమర్శించారు. ఆపరేషన్ సింధూర్‌ను తమాషా అని పేర్కొన్న కాంగ్రెస్‌ను తప్పుపట్టారు. తాజాగా జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో కాంగ్రెస్ ఎంపీ పరిణీతి షిండే ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. ఆపరేషన్ సింధూర్‌ను ఎవరైనా తమాషా అని పిలుస్తారా అని ప్రధాని అన్నారు. ఆపరేషన్ సింధూర్ సక్సెస్ వల్ల విపక్ష నేతలకు కడుపు నొప్పి పుడుతోందన్నారు. పాకిస్థాన్‌లో ఉన్న ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేశామన్న వాస్తవాన్ని కాంగ్రెస్ కానీ, దాని మిత్రులు జీర్ణించుకోలేకపోతున్నట్లు చెప్పారు. విశ్వనాథుడి ఆశీర్వాదంతో ఆపరేషన్ సిందూర్ సక్సెస్ అయ్యిందన్నారు. ఆపరేషన్ సింధూర్‌తో ప్రతీకారం తీర్చుకున్నామన్నారు.

కాశీలో ఉన్న మాస్టర్లను అడగాలనుకుంటున్నానని, భారత శక్తిపై మీరు గర్వంగా ఫీలవ్వడం లేదా అని ప్రధాని అన్నారు. భారత్‌లో తయారీ అయిన ఆయుధాలు ఆపరేషన్ సింధూర్ సమయంలో తమ సత్తాను చాటినట్లు చెప్పారు.

పాకిస్థాన్‌లో ఉన్న చాలా వైమానిక స్థావరాలు ఇంకా ఐసీయూ స్థితిలోనే ఉన్నాయని, పాకిస్థాన్ బాధపడుతోందని, దాన్ని ఎవరైనా అర్థం చేసుకోగలరని, కానీ కాంగ్రెస్, సమాజ్ వాదీ పార్టీలు మాత్రం పాకిస్థాన్ బాధను చూడలేకపోతున్నారని ప్రధాని అన్నారు. ఉగ్రవాదులకు మద్దతు ఇచ్చే వాళ్లు పాకిస్థాన్‌లోనూ, ఇండియాలోనూ ఏడుస్తున్నారని విమర్శించారు.

మన సైనిక బలగాలను కాంగ్రెస్ నిత్యం అవమానిస్తోందని, ఆపరేషన్ సింధూర్‌ను తమాషా అని పిలుస్తోందని మోదీ అన్నారు. కాంగ్రెస్ వ్యాఖ్యలను సిగ్గులేని చర్యగా ఆయన అభివర్ణించారు. ఉగ్రవాదులను ఇప్పుడు ఎందుకు చంపారని సమాజ్‌వాదీ పార్టీ అడుగుతోందని, వాళ్లను పిలిచి.. చంపాలా వద్దా అని అడగాలా, లేదంటే వాళ్లు పారిపోయే వరకు వేచి చూడాలని అని ప్రశ్నించారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో భారతదేశ రుద్ర స్వరూపాన్ని ప్రపంచం తిలకించిందని, ఇప్పుడు నవ భారతం శత్రువులకు కాలభైరవుడిగా మారినట్లు ప్రధాని మోదీ వెల్లడించారు.

# పార్లమెంట్ సాక్షిగా తప్పుడు లెక్కలు చెప్పడం శోచనీయం

**– రాష్ట్రానికి ఖరీఫ్ 2025కి కేటాయించిన యూరియా 9.80 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే –**

**రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల**

హైదరాబాద్ ఆగష్టు 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );పార్లమెంట్ సాక్షిగా యూరియా సరఫరాపై తప్పుడు లెక్కలు చెప్పడం శోచనీయమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుగారు అన్నారు. రాష్ట్రానికి 9.80 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించి, పార్లమెంట్ లో మాత్రం 20.20 లక్షల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని చెప్పడం వలన రాష్ట్ర రైతులు అయోమయానికి గురయ్యే అవకాశం ఉందని మంత్రిగారు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో యూరియా పరిస్థితులపై కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ సహాయమంత్రి అనుప్రియ పటేల్ గారికి కేంద్ర రసాయనాలు మరియు ఎరువుల విభాగం రాష్ట్రానికి కేటాయించిన ఎరువుల లేఖను జతపరిచి మంత్రి తుమ్మల లేఖ రాశారు. ఖరీఫ్ 2025 కోసం రాష్ట్రానికి కేవలం 9.80 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కేటాయించిందని, కేటాయించిన దానిలో కూడా నెలవారి సరఫరా చేయాల్సిన దానికంటే తక్కువగా సరఫరా చేయడం వలన రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడిందని లేఖలో పేర్కొన్నారు. ఎప్రిల్ నుండి జులై వరకు కేటాయింపుల ప్రకారం 6.60 లక్షల మెట్రిక్ టన్నుల సరఫరా చేయాల్సి ఉండగా, కేంద్రం 4.36 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేసిందని, దీంతో రాష్ట్రంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కేవలం తెలంగాణ రాష్ట్రంలోనే కాకుండా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ లో కూడా ఈ పరిస్థితులు ఉన్నాయని గుర్తుచేశారు. యూరియా కొరతపై రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జెపి నడ్డాగారికి లేఖలు కూడా రాయడం జరిగిందని లేఖలో పేర్కొన్నారు. పార్లమెంట్ లాంటి వేదికలలోకూడా తప్పుడు లెక్కలు సమర్పించడం రాష్ట్రాల ప్రయోజనాలను దెబ్బతీస్తుందని, జులై మాసం వరకు కేటాయింపుల ప్రకారం సరఫరా కాని 2.24 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కలుపుకొని, ఆగస్టు నెలకు కేటాయించిన యూరియాను త్వరగా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రిగారు లేఖలో కోరారు.

# ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో రాజ్యాంగం ప్రమాదంలో ఉంది

**- 11 ఏళ్లుగా సామాజిక న్యాయం కోసం ఆలోచించడంలేదు**

**-దేశంలో సామాజిక న్యాయం, దళితులు, ఆదివాసీల సంక్షేమం కోసం కృషి చేసింది కాంగ్రెస్ పార్టీ**

**-దేశానికి మార్గదర్శనం కోసం మనుసింఘ్వీ నేతృత్వంలో సదస్సు నిర్వహించడం గొప్పవిషయం**



న్యూ ఢిల్లీ ఆగష్టు 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: స్వాతంత్ర్య సాధన కోసమే కాంగ్రెస్ పార్టీ ఏర్పాటైందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఆంగ్లేయులను దేశం నుంచి పారద్రోలి దేశానికి స్వాతంత్ర్యం ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని ప్రశంసించారు. ఢిల్లీలోజరుగుతున్న కాంగ్రెస్ వార్షిక న్యాయ సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగించారు. రెండు చెంప దెబ్బలు కొట్టయినా వక్ర మార్గంలో ఉన్న నేతలను దారిలోకి తెచ్చేందుకు కాంగ్రెస్ కృషి చేస్తోందని పేర్కొన్నారు. బిజెపి, బిఆర్ఎస్, జెడి, బిజెపి, ఆర్‌జెడి, టిఎంసి, డిఎంకె, అన్నాడిఎంకెతో ఏ పార్టీ అయినా స్వాత్రంత్యం తరువాతే వచ్చాయని తెలియజేశారు. దేశంలో సామాజిక న్యాయం, దళితులు, ఆదివాసీల సంక్షేమం కోసం కృషి చేసింది కాంగ్రెస్ పార్టీ అని, ఇతర పార్టీలు ఎన్నికల్లో గెలిస్తే కూర్చీలో? ఓడితే ఇంట్లో కూర్చుంటాయని, ఎన్నికల్లో ఓడినా, గెలిచినా ప్రజల మధ్యే ఉన్న పార్టీ కాంగ్రెస్ అని రేవంత్ రెడ్డి కొనియాడారు.ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో రాజ్యాంగం ప్రమాదంలో ఉందని, 11 ఏళ్లుగా సామాజిక న్యాయం కోసం ఆలోచించడంలేదని, దేశానికి మార్గదర్శనం కోసం మనుసింఘ్వీ నేతృత్వంలో సదస్సు నిర్వహించడం గొప్పవిషయమన్నారు. సామాజిక న్యాయాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కార్యాచరణ చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశానికి ఏం చేసిందని విమర్శలు చేస్తున్నారని, 140 ఏళ్ల క్రితమే ప్రజల స్వాతంత్ర్యం కోసం కాంగ్రెస్ కదం తొక్కిందన్నారు. ఆంగ్లేయులను ఓడించి దేశ స్వాతంత్ర్యానికి కాంగ్రెస్ కృషి చేసిందని తెలియజేశారు. దేశం నుంచి తీవ్రవాదులను పారద్రోలేందుకు దివంగత ప్రధాని ఇందిరా గాంధీ కృషి చేశారని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. దేశం కోసం మహాత్మా గాంధీ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ అమరులయ్యారని ప్రశంసించారు. యుపిఎ 1 సమయంలో సోనియా గాంధీని ప్రధాని కావాలని అందరూ కోరారని, ప్రధాని పదవిని ఆమె త్యాగం చేశారన్నారు.

# 'ఆయన దగ్గర ఆటమ్ బాంబు ఉంటే పేల్చనివ్వండి'.. రాహుల్‌గాంధీకి రక్షణ మంత్రి కౌంటర్



న్యూఢిల్లీ,ఆగష్టు 2: అధికార బీజేపీ కి మేలు చేసేలా కేంద్ర ఎన్నికల సంఘం ఓట్ల దొంగతనానికి పాల్పడుతోందని, అందుకు సంబంధించి తన దగ్గర ఆటమ్ బాంబు లాంటి సాక్ష్యం ఉందని శుక్రవారం కాంగ్రెస్ ఎంపీ , లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీచేసిన వ్యాఖ్యలకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కౌంటర్ ఇచ్చారు.

రాహుల్‌గాంధీ దగ్గర ఆటమ్ బాంబు ఉంటే పేల్చనిద్దామని, కానీ ఆ పేలుడులో ఎలాంటి హాని జరగకుండా ఆయనను ఆయన కాపాడుకోవాలని రక్షణ మంత్రి ఎద్దేవా చేశారు. 'రాహుల్‌గాంధీ తన దగ్గర ఆటమ్ బాంబు ఉందంటున్నాడు. ఉంటే ఒకసారి ఆయన దాన్ని పేల్చాలి. అయితే ఆ పేలుడు ఎలాంటి హాని జరగకుండా ఆయనను ఆయన కాపాడుకోవాలి' అని వ్యాఖ్యానించారు.

అధికార బీజేపీ కోసం ఈసీ ఓట్ల చౌర్యానికి పాల్పడుతుందంటున్న రాహుల్‌గాంధీ తన ఆరోపణలను వెనక్కి తీసుకోవాలని రక్షణ మంత్రి హెచ్చరించారు. లేదంటే శనివారం పూట నిప్పుతో ఆడుకోవడమైనా ఆపాలని వార్నింగ్ ఇచ్చారు. రాహుల్‌గాంధీ పార్లమెంట్లో భూకంపం సృష్టించబోతున్నాడని గతంలో కూడా ఆయన మనుషులు హంగామా చేశారని రాజ్‌నాథ్ గుర్తుచేశారు.

కానీ రాహుల్‌గాంధీ పార్లమెంట్‌లో మాట్లాడినా ఎలాంటి భూకంపం రాలేదని, పైగా ఆ ప్రసంగం తడిచిన పటాసు లెక్క తుస్సుమన్నదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ చేతికి ఎమర్జెన్సీ రక్తపు మరకలు ఉన్నాయని రాహుల్‌గాంధీ గుర్తుపెట్టుకోవాలని, వైరిపక్షాలపై నోటికొచ్చిన ఆరోపణలు మానుకోవాలని రాజ్‌నాథ్ హితవుపలికారు.

# హరి చందన మరియు పింకీ రెడ్డి చేత తొలి ఎఫ్ఎల్ఓ జాబ్ ఫెయిర్ ప్రారంభం

**-పాల్గొన్న 35 కంపెనీలు.. 1200 మంది ఉద్యోగార్థులు హాజరయ్యారు**



హైదరాబాద్, ఆగస్ట్ 2 (ఎక్స్ ప్రెస్ న్యూ స్) దేశంలోని ప్రముఖ మహిళల వ్యాపార సంస్థ ఎఫ్ఎల్ఓ ఆధ్వర్యంలో మొట్టమొదటి ఎఫ్ఎల్ఓ జాబ్ ఫెయిర్ హైదరాబాద్‌లోని అవినాష్ కాలేజ్ ఆఫ్ కామర్స్, సికింద్రాబాద్ లో శనివారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని హైదరాబాద్ కలెక్టర్ హరి చందన దాసరి, ఎఫ్ఎల్ఓ మాజీ జాతీయ అధ్యక్షురాలు పింకీ రెడ్డి సంయుక్తంగా ప్రారంభించారు. ఎఫ్ఎల్ఓ జాతీయ వైస్ చైర్‌పర్సన్ కామిని సరాఫ్ కూడా ఈ ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. ఇది ఎఫ్ఎల్ఓ చరిత్రలోనే ప్రథమ జాతీయ స్థాయి జాబ్ ఫెయిర్‌గా నిలిచింది. దీని ద్వారా దేశవ్యాప్తంగా మహిళలకు, యువతకు నేరుగా ఉద్యోగ అవకాశాలు మరియు స్కిల్లింగ్ అవకాశాలు లభించేలా చేస్తోంది. దీన్ని తెలంగాణ డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ మద్దతుతో నిర్వహించారు. *HDFC బ్యాంక్, PayTM, Just Dial, Granules, Creamstone, Radha TMT, VisionTek, Dr. Rao's ENT, Insurance Saathi, Polmon లాంటి ప్రముఖ 35 కంపెనీలు ఇందులో పాల్గొన్నాయి. అకౌంట్స్, సేల్స్, డిజిటల్ మార్కెటింగ్, మైక్రోబయాలజీ, అడ్మిన్, డిజైన్ వంటి విభాగాల్లో ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయి. మొత్తం 1,200 మంది ఉద్యోగార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా హరి చందన దాసరి మాట్లాడుతూ "ఈఊా చేసిన ఈ ప్రయత్నం ఎంతో ప్రశంసనీయమైనది. యువత, ముఖ్యంగా మహిళలకు నేరుగా ఉద్యోగ అవకాశాలను కల్పించడం ద్వారా తెలంగాణలోని ఉపాధి వ్యవస్థను బలోపేతం చేస్తున్నాయి.""నల్గొండలో ఇదే తరహా కార్యక్రమం చేసినప్పుడు 40 పోస్టులకు 10,000 మంది వచ్చారు. ఈ గ్యాప్‌ను తగ్గించాల్సిన అవసరం ఉంది. ఇది ఉద్యోగులు మరియు ఉద్యోగదారుల మధ్య మ్యాచ్ మేకింగ్ సమయోచిత ఆవశ్యకత," అని ఆమె పేర్కొన్నారు. ''ఉద్యోగులను నిలబెట్టుకోవాలంటే, సంస్థలు వారికి తామే ఈ సంస్థకు యజమానులమనే భావన కలిగించే వాతావరణాన్ని కల్పించాలి,'' అన్నారు. అలాగే, తెలంగాణ ప్రభుత్వం 65 ప్రభుత్వ ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చేందుకు ప్రణాళికలు వేస్తోందనిపేర్కొన్నారు.పింకీ FLO మాజీ జాతీయ అధ్యక్షురాలు మాట్లాడుతూ: ''FLO 43 ఏళ్ల ప్రయాణంలో ఇది ఒక మైలురాయి. ఉద్యోగ అవసరాలు మరియు ఆశయాలను సమన్వయం చేస్తూ దేశవ్యాప్తంగా విస్తరించే స్థిరమైన వేదికను సృష్టించగలిగాం." FLO హైదరాబాద్ చైర్‌పర్సన్ ప్రతిభా కుందా మాట్లాడుతూ: "హైదరాబాద్‌లో ఈ జాతీయ ఉద్యమాన్ని ప్రారంభించడం గర్వకారణం. ఇది మొదటివిడత మాత్రమే." DEET డైరెక్టర్ జె. రాజేశ్వర్ రెడ్డి ఇప్పటివరకు 90,000 మంది ఉద్యోగార్థులు, 1500 కంపెనీలు DEET పోర్టల్‌లో నమోదు అయ్యారు 2500 ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదలయ్యాయి ప్రస్తుతం 10,000 ఖాళీలు అందుబాటులో ఉన్నాయి5 సంవత్సరాలలో 20 లక్షల మంది ఉద్యోగార్థులు, 10,000 కంపెనీలు, 2500 సంస్థలు మరియు లక్ష స్కిల్ అప్‌గ్రేడేషన్‌లు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు అన్నారు

# ఆగస్టు 4న తెలంగాణ క్యాబినెట్ సమావేశం

హైదరాబాద్, ఆగష్టు 2: ఈ నెల 4వ తేదీన తెలంగాణ క్యాబినెట్ సమావేశం కానుంది. ఆగష్టు 4న మధ్యాహ్నం 2 గంటలకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సెక్రెటేరియట్ లోని ఆరో అంతస్తులో సమావేశం జరగనుంది. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామ కృష్ణారావు తెలియజేశారు. ఈ మేరకు ఆయన పేరుతో ఒక ప్రకటన విడుదల చేశారు.క్యాబినెట్ సమావేశం సందర్భంగా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖల స్పెషల్ చీఫ్ సెక్రెటరీలు, ప్రిన్సిపల్ సెక్రెటరీలు, సెక్రెటరీలు తమతమ హెడ్ క్వార్టర్స్‌లో అందుబాటులో ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తన ప్రకటనలో ఆదేశించారు.

# ఇండియా మంచి నిర్ణయమే తీసుకుంది: డోనాల్డ్ ట్రంప్

న్యూయార్క్, ఆగష్టు 2: రష్యా నుంచి ఇంధనాన్ని ఇండియా కొనుగోలు చేయడం లేదని తెలిసిందని, ఇది మంచి నిర్ణయమని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్అన్నారు. అయితే దీనిపై సమగ్రమైన వివరాలు తెలియదన్నారు. ఇక ముందు రష్యా నుంచి ఇంధనాన్ని ఇండియా దిగుమతి చేసుకోదన్న వార్తలు వినిపించాయని, దాంట్లో ఎంత వాస్తవం ఉందో తనకు తెలియదని, ఒకవేళ అదే నిజమైతే అది మంచి నిర్ణయమని, దీనిపై పునరాలోచన చేస్తామని ట్రంప్ అన్నారు. ఆగస్టు ఒకటో తేదీ నుంచి వివిధ దేశాలపై ట్రంప్ సుంకాలను ప్రకటించిన విషయం తెలిసిందే. ట్రంప్ ఇచ్చిన ఎగ్జిక్యూటివ్ ఆదేశాల ప్రకారం ఇండియాపై 25 శాతం పన్ను పడనున్నది. అయితే రష్యా నుంచి సైనిక వస్తువులు, ఇంధనాన్ని కొనుగోలు చేస్తే భారత్‌పై పెనాల్టీ వేస్తామని ట్రంప్ అన్నారు. కానీ ఎంత పెనాల్టీ కట్టాలన్న దానిపై ఆయన ఏమీ క్లారిటీ ఇవ్వలేదు. రష్యా నుంచి ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్న అంశంపై ఇటీవల విదేశాంగ శాఖ ప్రతినిధి రణ్‌దీర్ జైస్వాల్ ను మీడియా ప్రశ్నించింది.

దానికి ఆయన సమాధానం ఇస్తూ.. అంతర్జాతీయ మార్కెట్‌లో అమలులో ఉన్న చమురు ధరల ఆధారంగా తాము నిర్ణయం తీసుకుంటామన్నారు. కానీ రష్యా నుంచి కొనుగోలు అంశంలో మాత్రం స్పష్టమైన సమాధానం ఆయన ఇవ్వలేకపోయారు. ఇండియాతో వాణిజ్య లోటు ఉందని, భారత్ మిత్రదేశమే అయినా, చాన్నాళ్ల నుంచి ఆ దేశంతో తక్కువ వ్యాపారమే చేశామని ట్రంప్ అన్నారు. ఎందుకంటే ఇండియాలో పన్నులు ఎక్కువ అని పేర్కొన్నారు. దీనికి తోడు రష్యా నుంచి భారీ స్థాయిలో మిలిటరీ ఎక్విప్మెంట్‌ను ఇండియా కొంటోందని, అందుకే ఆ దేశంపై 25 శాతం టారిఫ్ విధిస్తున్నామని, ఇంకా అదనంగా పెనాల్టీ కూడా వేయనున్నట్లు ట్రంప్ ఇటీవల పేర్కొన్న విషయం తెలిసిందే.






# 'వ్యవసాయ కూలీలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలి'

ఖమ్మం, ఆగష్టు 2: వ్యవసాయ కూలీలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మెరుగు సత్యనారాయణ, పొన్నం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం బోనకల్లు మండల కేంద్రంలోని వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల భవనంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభ జరిగింది.

ఈ మహాసభకు కారంగుల చంద్రయ్య, దూబ భద్రా చలం అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. మహాసభలో వారు మాట్లాడు తూ.. భూమి లేని వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేలు, ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఇస్తామని కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలు చేసిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వ్యవసా య కూలీలకు రోజువారి కూలీ రూ.400 అమలు చేసే విధంగా చట్టాన్ని తీసుకురావాలన్నారు.ఉపాధి హామీ పథకానికి కేంద్రం ప్రతి ఏడాది నిధులు తగ్గిస్తూ మొత్తంగా పథకాన్ని లేకుండా చేసేందుకు కుట్ర పన్నుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల పొట్ట కొట్టి పెట్టుబడిదారుల జేబులు నింపడమే మోదీ ప్రభుత్వ లక్ష్యంగా కనబడుతుందన్నారు. హక్కుల సాధన కోసం వ్యవసాయ కూలీలు రాజకీయాలకు అతీతంగా ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎర్ర శ్రీనివాసరావు, వత్సవాయి జానకి రాములు, గొర్రెల మేకల పెంపకందారుల సంఘం జిల్లా అధ్యక్షుడు చింతలచెరువు కోటేశ్వర రావు, తెలంగాణ రైతు సంఘం మధిర డివిజన్ నాయకులు కిలారి సురేశ్, వ్యవసాయ కార్మిక సంఘం మండల ప్రధాన కార్యదర్శి బంధం శ్రీనివాసరావు, దోబ భద్రాచలం, రాష్ట్ర నాయకురాలు బంధం వెంకటరాజ్యం పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా తెల్లాకుల శ్రీనివాసరావు, కార్యదర్శిగా బంధం శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా కర్లకుంట మత్తయ్య, సహాయ కార్యదర్శిగా పిక్కెల సీతారాములుతో పాటు మరో 16 మందిని కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# కన్వర్ యాత్రలో ఘర్షణ.. సీఆర్పీఎఫ్ జవాన్‌పై కాల్పులు ...జరిపి హత్య

చండీగఢ్, ఆగష్టు 2: కన్వర్ యాత్రకు వెళ్లిన సొంత గ్రామానికి చెందిన వ్యక్తులు, సీఆర్పీఎఫ్ జవాన్ మధ్య ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో సెలవుపై గ్రామానికి వచ్చిన ఆయనపై కాల్పులు జరిపి హత్య చేశారు. ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. హర్యానాలోని సోనిపట్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఖేరి దమ్మన్ గ్రామానికి చెందిన 30 ఏళ్ల కృష్ణన్ కుమార్, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్పీఎఫ్) జవాన్. ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో అతడు విధులు నిర్వహిస్తున్నాడు. కొన్ని రోజుల కిందట సొంత గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కన్వర్ యాత్ర కోసం హరిద్వార్ చేరుకున్నారు. ఈ సందర్భంగా సీఆర్పీఎఫ్ జవాన్ కృష్ణన్, వారి మధ్య ఘర్షణ జరిగింది.కాగా, ఈ గొడవ తర్వాత కృష్ణన్ సెలవుపై తన గ్రామానికి వచ్చాడు. జూలై 28న తెల్లవారుజామున ఇంటికి వెళ్తున్న అతడిపై కారులో వచ్చిన కొందరు వ్యక్తులు కాల్పులు జరిపి హత్య చేశారు. ఆ తర్వాత అక్కడి నుంచి పారిపోయారు.

మరోవైపు సీఆర్పీఎఫ్ జవాన్ హత్యపై పోలీసులు కేసు నమోదు చేశారు.

# స్నేహమేరా జీవితం.. స్నేహమేరా శాశ్వతం !

## (03 ఆగస్టు "జాతీయ స్నేహ దినోత్సవం" సందర్భంగా)

స్నేహం అంటే ఓ త్యాగం, ఆపదలో అభయ హస్తం, కష్టాల్లో ఓ శీతల నేస్తం, ఆపదలో సాంత్వన నీడను చేకూర్చే మహా వృక్షం. ప్రాణ స్నేహితులకు ప్రత్యామ్నాయం ఉండదు. స్నేహం చేయని మనిషి ఉండడు. స్నేహితులు లేని తనువు ఉండదు. ప్రతి వ్యక్తి జీవితంలో స్నేహానికి ఓ ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. స్నేహితుల హస్తాలు నిస్వార్థ నేస్తాలు. బంధువులతో లేని ఓ అపురూపమైన అనుబంధం స్నేహితులతో ఉంటుంది. కొన్ని సమయాల్లో కుటుంబ సభ్యులతో పంచుకోలేని విషయాలను సహితం స్నేహితులతో పంచుకుంటాం. మనకు స్నేహితులు అనేకులు ఉండవచ్చు కాని ప్రాణ మిత్రులు కొద్ది మంది మాత్రమే ఉంటారు. ప్రాణ స్నేహితులతో మనం అన్ని విషయాలను దాపరికం లేకుండా పంచుకుంటాం. మనసుకు ప్రశాంతత, శరీరానికి ఉపశమనం కలిగిస్తుంది స్నేహ హస్తం. సహానుభూతికి ఓ చక్కని ఉదాహరణ స్నేహం. పరస్పర గౌరవానికి, త్యాగానికి చిరునామా ఫ్రెండ్‌షిప్. సన్నిహిత మిత్రుడు అంటే ఓ మహా నమ్మకం. స్నేహానికి వయోభేదం లేదు. చంటి వాడి నుంచి పండు ముసలి వరకు అందరికీ స్నేహితులు ఉంటారు, వద్దన్నా ఆనందాలను వడ్డిస్తూ ఉంటారు.

### జాతీయ స్నేహ దినోత్సవం-2025 :

స్నేహం విలువను తెలుసుకోవడం, మంచి స్నేహితులతో సంబంధాలు కొనసాగించడం, అపార్థాలను నివృత్తి చేసుకొని స్నేహాన్ని కొనసాగించడం, బేధాభిప్రాయాలను దూరం చేసుకోవడం, పౌర సమాజంలో శాంతి పందిరి వేయడానికి అనుకూలమైన అనువైన సందర్భంగా ప్రతి ఏట ఆగస్టు మాసంలోని మొదటి ఆదివారం రోజున "జాతీయ స్నేహ దినోత్సవం (నేషనల్ ఫ్రెండ్‌షిప్ డే)" పాటించడం కొనసాగుతున్నది. 2025 జాతీయ స్నేహ దినం వేదికగా స్నేహ మార్గం ద్వారా శాంతి, సంఘీభావం, సంస్కృతుల మధ్య అవగాహనలను పెంపొందించే ప్రయత్నాలు నిర్వహించాలి. వివిధ దేశాలు, జాతులు, మతాలు, కులాలు, అసమానతలను మరిచి అందరం స్నేహ బంధంతో ఏకం కావడమే లక్ష్యంగా ఈ దినోత్సవాన్ని జరుపుకుంటాం. స్నేహ బంధం పరమ పవిత్రమైనది. నిజమైన స్నేహితుల మధ్య విడదీయరాని ప్రేమ అనే అభేద్య బంధం పెనవేసుకొని ఉంటుంది. మంచి స్నేహితులు కొన్ని విషయాల్లో విభేదించినా, సదా ఒక్కటిగానే ఉంటారు.

### స్నేహితులతో కొత్త ప్రపంచం పరిచయం :

చిన్ననాడే స్నేహం అనే బంధం మొలకెత్తుతుంది. అమ్మనాన్న తర్వాత మన సంక్షేమాన్ని, శ్రేయస్సును నిస్వార్థంగా తలుస్తూ మన వెంట నడిచే వ్యక్తులు మన ప్రాణ మిత్రులు మాత్రమే. బడికి వెళ్లడంతో మనకు నూతన స్నేహితులు పుడతారు. వారితోనే మన దినచర్య ముడిపడి ఉంటుంది. చదవడం, ఆడడం, పాడడం, మాట్లాడుకోవడం, సరదాగా తిరగడం లాంటివి మన ప్రాణ స్నేహితులతోనే ముడిపడి ఉంటాయి. ఒకే కంచంలో తిని ఒకే మంచంలో పడుకునే స్థాయికి స్నేహం ఎదుగుతుంది. తరగతులు పెరిగిన కొద్దీ తరగతులు మారుతూ, కొత్త మిత్రులు వచ్చి చేరతారు. పాత మిత్రుల స్నేహం కొనసాగుతూనే ఉంటుంది. స్నేహితులు పెరిగిన కొద్దీ బయటి ప్రపంచం కొత్తగా కనిపిస్తుంది. అందరి సంస్కృతీ వారసత్వాలు అర్థం అవుతాయి. మన జీవితానికి లక్ష్యాలను కూడా మిత్రులు నిర్ణయించుకునే స్థాయి కూడా వస్తుంది. అంతర్జాతీయ స్నేహ దినం వేదికగా పాత మిత్రులను కలవడం, కొత్త మిత్రులతో సరదాగా గడపడం, ఆపాత మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకోవడం, ఫ్రెండ్‌షిప్ బ్యాండ్స్ పంచుకోవడం, తమ తమ అనుభవాలను పంచుకోవడం, స్నేహితుల కష్టాలను తెలుసుకొని సహాయం చేయడం, సామా జిక మాధ్యమాల్లో స్నేహ బంధాల విలువను వివరించడం, పాత స్నేహితులతో ఉన్న ఫోటోలను పంచుకోవడం, హాపీ ఫ్రెండ్‌షిప్ డే శుభాకాంక్షలు చెప్పుకోవడం లాంటి కార్యక్రమాలను నిర్వహించుకోవచ్చు.

-డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# ములుగుగూడెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బ్యాగులు పంపిణీ



ఖమ్మం, ఆగష్టు 2: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం ములుగుగూడెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం దాత, కొత్తగూడెం బాబు క్యాంపునకు చెందిన సందీప్ బ్యాగులు పంపిణీ చేశారు.

ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ బాలాజీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరు చేయూతనివ్వాలని కోరారు. దాతలు మరింత మంది ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రాము, ఉపాధ్యాయులు వెంకటమ్మ, బాలు, గ్రామస్తులు నరేశ్, లక్ష్మణ్, చంటి, వరప్రసాద్, సీఆర్పీ రవీందర్, మధు పాల్గొన్నారు.

# చట్టాలకు విరుద్ధంగా భవనాల నిర్మాణాలు నిలిపివేయాలి

ఆదిలాబాద్, ఆగష్టు 2: ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా గిరిజనేతరులు అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవనాలను నిలిపివేయాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ మండల ప్రధాన కార్యదర్శి అర్కా గోవింద్ డిమాండ్ చేశారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి కుమ్ర మోతిరాంకు వినతి పత్రాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజ నేతరులు ఎలాంటి అనుమతులు లేకుండా భవనాలను నిర్మిస్తున్నా కనీసం అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు.

భవనాల పనులను నిలిపివేయాలని, నోటీసులు జారీ చేయాలని కోరారు.

లేనిపక్షంలో సంబంధిత శాఖ అధికారులపై న్యాయం కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుమ్ర జైతు, సెడ్మాకి వినోద్, గంగారం, తిరుపతి ఉన్నారు.

# తిరుగులేని శక్తిగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

## -మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి



హైదరాబాద్, ఆగష్టు 2:బీఆర్ఎస్ పార్టీ అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషిచేస్తున్న వారందరికీ భవిష్యత్‌లో తగిన గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సీతారాం దూళిపాళ్ల, యువజన విభాగం అధ్యక్షుడు సంగం శ్రీకాంత్ నేతృత్వంలో శుక్రవారం పలువురు యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సబితారెడ్డి నివాసంలో వారికి నియోజవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి కార్తిక్‌రెడ్డి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే సబితారెడ్డి మాట్లాడుతూ రాజేంద్రనగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ తిరుగులేని శక్తిగా అవతరిస్తోందన్నారు.

రాజేంద్రనగర్ నియోజకవర్గ అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిందంటే అందుకు అప్పటి బీఆర్ఎస్ సర్కారు వెచ్చించిన నిధులేనని కార్తిక్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా పలువురు యువనాయకులకు పార్టీ పదవులను కేటాయించారు. యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.శివకుమార్, ప్రధాన కార్యదర్శి మహేశ్వరం సుమన్, ఉపాధ్యక్షులుగా కందాడ ప్రవీణ్, ఏ.తిరుపతి, కార్యదర్శిగా ఎం.శ్రావణ్, క్రిస్టియన్ మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా కొలువురి జయరాం, ప్రధాన కార్యదర్శిగా బండి శ్యాంసుందర్, ఉపాధ్యక్షులుగా బెన్నీ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ప్రమోద్, కార్యదర్శిగా కృపాకర్, ఉప కార్యదర్శిగా రఘు వంశీ, కోశాధికారిగా శేషనాగ్, షిండే, పలువురిని పదాధికారులుగా నియమించి ధ్రువీకరణపత్రాలను అందజేశారు.

అంకితభావంతో పనిచేయాలి

బీఆర్ఎస్ పటిష్టత కోసం అంకితభావంతో పని చేయాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి గులాబీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. చేవెళ్లకు చెందిన ఎస్ఎఫ్ఐ నాయకులు శుక్రవారం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే సబితా రెడ్డి, కార్తీక్‌రెడ్డి గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు.

# బిడ్డకు తల్లి పాలు శ్రేయస్కరం : ఎంపీడీఓ జ్ఞానప్రకాశ్ రావు

నల్గొండ, ఆగష్టు 2: తల్లి పాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని కట్టంగూర్ ఎంపీడీఓ పెరుమాళ్ల జ్ఞానప్రకాశ్ రావు అన్నారు. అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం మండల కేంద్రంలోని అంబటివాగులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలు పట్టించాలని, అప్పుడే వచ్చే ముర్రుపాలలో బలవర్ధకమైన న్యూట్రీషియన్లు, ప్రోటీన్లు ఉంటాయన్నారు. తల్లిపాల వల్ల భవిష్యత్‌లో ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తవన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ స్వరూపరాణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శారదారాణి, ఏఎన్ఎం వరలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ సైదమ్మ, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.




# దేశంలో టీకా కార్యక్రమం ద్వారా చిన్నారులకు ఉచితంగా 11 టీకాలు

న్యూఢిల్లీ,ఆగష్టు 2:జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చిన్నారులు, గర్భిణులకు టీకాలు వేసేందుకు సాధారణ టీకా సెషన్లను వారానికోసారి ఏర్పాటు చేస్తారు. ప్రతి సెషన్‌కు ముందు ఆ ప్రాంతానికి చెందిన ఆశా కార్యకర్త ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు టీకాలు వేసే ప్రదేశం వివరాలు చెప్తారు. వ్యాక్సినేషన్ చేపట్టే రోజున టీకాలు వేయించుకొనే విధంగా చిన్నారులు, గర్భిణులను ప్రోత్సహిస్తారు.

దేశంలో టీకాలను విస్తృతంగా అందించేందుకు సమాచారం, అవగాహన, ప్రసార (ఐఈసీ) కార్యక్రమాలను దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నారు. మీడియా ప్రముఖుల ద్వారా దూరదర్శన్, రేడియో జింగిల్స్, యూట్యూబ్ పాడ్‌కాస్ట్ ద్వారా ఐఈసీ అవగాహన చేపడుతున్నారు. ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలు, ఫేస్‌బుక్ పేజీలు వంటి సోషల్ మీడియా వేదికలను కూడా ఉపయోగిస్తున్నారు. ప్రాంతీయ స్థాయిలో బహిరంగ ప్రకటనలు, పోస్టర్లు, బృంద సమావేశాలు చేపడుతున్నారు.

దేశంలో గత అయిదేళ్లలో టీకా ప్రచారం, ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని మరింత ప్రభావవంతంగా చేపట్టడానికి ప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమాలు:

స్టేట్ టాస్క్ ఫోర్స్ ఆన్ ఇమ్యునైజేషన్ (ఎస్టీఎఫ్ఐ), డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ ఆన్ ఇమ్యునైజేషన్ (డీటీఎఫ్ఐ), బ్లాక్ టాస్క్ ఫోర్స్ ఆన్ ఇమ్యునైజేషన్ (బీటీఎఫ్ఐ) క్రమం తప్పకుండా నిర్వహించే వ్యాక్సినేషన్ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలయ్యేలా చూస్తాయి.

ఇమ్యునైజేషన్ కవరేజీని పెంచడానికి అవగాహన, సామాజిక సమీకరణ, కుటుంబ స్థాయిలో సమాచారం, పాత్రికేయ సమావేశాలు తరహా వ్యూహాత్మక కార్యక్రమాలు నిర్వహించారు.

సార్వత్రిక టీకా కార్యక్రమం ద్వారా ఇమ్యునైజేషన్ కవరేజీ తక్కువగా ఉన్న ప్రాంతాల్లో టీకాలు తీసుకోని, మధ్యలో మానేసిన చిన్నారులు, మహిళల కోసం మిషన్ ఇంద్రధనుష్, ప్రత్యేక క్యాచప్ వ్యాక్సినేషన్ కార్యక్రమం.

ప్రతి ఏటా నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా జాతీయ టీకా దినోత్సవాలు (ఎన్ఐడీ) లాంటి ప్రత్యేక వ్యాక్సినేషన్ కార్యక్రమాల నిర్వహణ.

ఇమ్యునైజేషన్ కార్యక్రమాలకు నిర్దేశించిన రోజుల్లో గ్రామీణ ఆరోగ్యం, పోషకాహార దినోత్సవాలు (వీహెచ్ఎన్‌డీ) నిర్వహణ

డిజిటల్ రిజిస్ట్రేషన్, చిన్నారులు, గర్భిణీలకు ఇచ్చే టీకాలను రికార్డు చేయడానికి కుటుంబ, ఆరోగ్య సంక్షేమ మంత్రిత్వ శాఖ యు-విన్ పోర్టల్ ప్రారంభించింది.

లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు బదులుగా కేంద్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి అనుప్రియా పటేల్ ఈ సమాచారాన్ని లిఖితపూర్వకంగా అందించారు.

# దేశమంతటా 1.78 లక్షలకు పైగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల (ఏఏఎంల) సేవలు

న్యూఢిల్లీ,ఆగష్టు 2:రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (ఏఏఎం) పోర్టల్లో నమోదు చేసిన సమాచారం ప్రకారం, కిందటి నెల 15 నాటికి దేశవ్యాప్తంగా మొత్తం 1,78,154 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు సేవల్ని అందిస్తున్నాయి. ఇదివరకటి ఆయుష్మాన్ భారత్ హెల్త్-వెల్‌నెస్ సెంటర్లు (ఏబీ-హెచ్‌డబ్ల్యూసీస్)నే ప్రస్తుతం ఏఏఎంలుగా వ్యవహరిస్తున్నారు.

సబ్ హెల్త్ సెంటర్లను (ఎస్‌హెచ్‌సీ), ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను (పీహెచ్‌సీ) బలోపేతం చేసి ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల రూపంలో సమగ్ర ప్రాథమిక ఆరోగ్యసంరక్షణను అందిస్తున్నారు. ఈ ఏఏఎంలు నివారణ, ప్రోత్సాహం, పునరావాసం, చికిత్స అనంతర సంరక్షణ సేవలను అందిస్తున్నాయి. అంటురోగాలు, ఇతరులకు సోకని రోగాలు (ఎన్‌సీడీస్), సంతానోత్పత్తి సంబంధిత, బాలల ఆరోగ్యసంరక్షణ సేవలతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు వీటి పరిధిలోకి వస్తున్నాయి.

పన్నెండు ప్యాకేజీలతో కూడిన ప్రాథమిక ఆరోగ్యసంరక్షణ సేవలను అందజేయడానికి ఉన్నతీకరించిన మౌలిక సదుపాయాలను కల్పించడం, అదనపు సిబ్బందిని సమకూర్చడం, అత్యవసర మందులు, రోగనిర్ధారణ, ఐటీ వ్యవస్థల వంటివి సహా అవసరమైన ఇతర సాధనాలను కూడా ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలకు సమకూర్చారు. ప్రజల ఇళ్లకు దగ్గర్లోనే ప్రాథమిక స్వాస్థ్య సంరక్షణ సేవలను అందించడానికి ఏఏఎంకు చెందిన ప్రాథమిక ఆరోగ్యసంరక్షణ బృంద సభ్యులకు శిక్షణ ఇస్తున్నారు.

జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం)లో భాగంగా 'ఉచిత రోగనిర్ధారణ సేవా కార్యక్రమాన్ని' (ఎఫ్‌డీఎస్ఐ) 2015లో కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రారంభించింది. ప్రజలకు చేరువలో రోగలక్షణాలను తెలుసుకోవడానికి సంబంధించిన, రేడియోలాజికల్ డయాగ్నసిస్ సంబంధిత సేవలను సులభ పద్ధతిలో, తక్కువ ధరలకు అందజేయడమే ఈ కార్యక్రమం ధ్యేయం. పీహెచ్‌సీలలో అన్ని స్థాయిల్లో ఉచిత రోగనిర్ధారణకు సంబంధించిన అనేక సేవలను ఉచితంగా అందజేయాలన్నది ఎఫ్‌డీఎస్ఐ లక్ష్యం. దీనిలో సబ్ సెంటర్లలో నిర్వహించే 14 పరీక్షలతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో నిర్వహించే 63 పరీక్షలు కలిసి ఉంటాయి.

రోగాలను నయం చేయడానికి తోడు, ప్రోత్సాహక ప్రధాన, నివారణ ప్రధాన ఆరోగ్య సేవల లభ్యత సమగ్ర ప్రాథమిక ఆరోగ్యసంరక్షణలో ఓ విడదీయలేని భాగం. వెల్‌నెస్‌కు సంబంధించిన యోగ, సైకిలింగ్, ధ్యానం వంటి కార్యకలాపాలను కూడా ఏఏఎంలలో నిర్వహిస్తున్నారు. గత జూన్ 30 నాటికి మొత్తం 5.73 కోట్ల వెల్‌నెస్ కార్యక్రమాలను ఈ ఏఏఎంలలో నిర్వహించారు.

ఆరోగ్య రంగ అనుబంధ విస్తారిత వ్యవస్థ (హెల్త్ ఇకోసిస్టమ్) పరిధిలో స్వాస్థ్య సమాచారాన్ని వివిధ విభాగాలు ఉపయోగించుకొనేందుకు వీలుగా ఒక ఆన్‌లైన్ ప్లాట్‌ఫారాన్ని రూపొందించడం ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఏబీడీఎం) ఉద్దేశం. దీంతో పౌరులందరికి ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డును సిద్ధం చేయడం సాధ్యపడుతుంది. పౌరులకు ఆరోగ్య సేవలు సులభంగా అందజేయడానికి కూడా వీలవుతుంది. సంరక్షణకయ్యే ఖర్చును తగ్గించడంతో పాటు ప్రయివేటు, ప్రభుత్వ ఆరోగ్యసంరక్షణ సంస్థలలో సేవల లభ్యతను మరింత మెరుగుపరచవచ్చు. ఏబీడీఎమ్ ఏర్పాటు చేసిన డిజిటల్ హెల్త్ ఇకోసిస్టమ్ ప్రాథమిక, రెండో, మూడో స్థాయిల ఆరోగ్యసంరక్షణ సేవల్లో ఎలాంటి ఆటంకం ఎదురవకుండా సేవలు నిరంతరాయంగా అందేటట్లు తోడ్పడుతుంది. ఇంతవరకు ఆరోగ్య సంబంధిత వివిధ పోర్టళ్లలో 79.75 కోట్ల 'ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ (ఏబీహెచ్ఏ) ఐడీ'లను రూపొందించడమే కాకుండా, 65.34 కోట్ల ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులను (ఈహెచ్ఆర్) లింక్ చేశారు.

ఒక్కో ఏఏఎంను ఏర్పాటు చేసి, నిర్వహించడానికి దాదాపు రూ.17.03 లక్షలు ఖర్చవుతుందని అంచనా. దీనిలో ఒకసారి పెట్టే ఖర్చుతో పాటుచ ఒక సంవత్సర కాలం వరకు మళ్లీ మళ్లీ పెట్టాల్సిన ఖర్చులు కూడా కలిసి ఉంటాయి. ఎన్‌హెచ్ఎంలో భాగంగా ఏఏఎంను ఏర్పాటు చేయడానికి, నిర్వహించడానికి అయ్యే మొత్తం బడ్జెటును రాష్ట్రాలుగాని, కేంద్ర పాలిత ప్రాంతాలు గాని దాఖలు చేసే కార్యక్రమ అమలు ప్రణాళిక (పీఐపీ)లో పేర్కొన్న ప్రకారం ఎన్‌హెచ్ఎం రికార్డ్ ఆఫ్ ప్రొసీడింగ్స్ (ఆర్ఓపీ) కింద ఆమోదిస్తారు.

ఈ సమాచారాన్ని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీ ప్రతాప్‌రావ్ జాదవ్ లోక్‌సభలో ఈ రోజు రాతపూర్వకంగా ఇచ్చిన ఒక సమాధానంలో తెలిపారు.

# ప్రతి ఒక్క అర్హుడికి రేషన్ కార్డు ఇవ్వండి

## -గతంలో కార్డులు రాలేదన్న వ్యాఖ్యలు అసత్యం
## -2016 నుంచి 2023 వరకు 6 లక్షలకు పైగా మంజూరయ్యాయి
## -ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్

హైదరాబాద్, ఆగష్టు 1: రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి అర్హుడికి ఇవ్వాలని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్ కోరారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని బంజారాభవన్ జరిగిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పొన్నంతో కలిసి హాజరైన ఎమ్మెల్సీ దాసోజు రేషన్ కార్డుల మంజూరీలో ఉన్న లోపాలను ఎత్తిచూపారు. ఖైరతాబాద్ సర్కిల్‌లో 22,399 మంది దరఖాస్తు చేసుకుంటూ కేవలం 1959 మందికి మాత్రమే కార్డులు మంజూరు చేయడం అన్యాయమన్నారు. బహదూర్‌పురా, కార్వన్, జూబ్లీహిల్స్, నాంపల్లి వంటి నియోజకవర్గాల్లో 5వేలకు పైగా కార్డులు ఇచ్చారన్నారు. ఈ వ్యత్యాసానికి కారణాలపై ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో రేషన్ కార్డులకు దరఖాస్తులు తీసుకున్నారని, అయితే ఇప్పటి వరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి ఎంత మందికి మంజూరు చేశారు.?అనే గణాంకాలు అధికారికంగా విడుదల చేయాలన్నారు.

కాగా, సభలో గత పది సంవత్సరాల్లో ఒక్క రేషన్ కార్డు కూడా రాలేదని ఓ సివిల్ సప్లయి కార్యదర్శి వ్యాఖ్యలు చేయగా, ఎమ్మెల్సీ దాసోజు ఖండించారు. ఓ ఉన్నతాధికారి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలా మాట్లాడడం సరికాదని, ఆ వ్యాఖ్యలు పూర్తిగా వాస్తవానికి విరుద్ధమన్నారు. రేషన్ కార్డుల మంజూరీకి సంబంధించిన డేటా ఆన్‌లైన్‌లో చూసుకోవాలన్నారు. వెంటనే సదరు అధికారి తన తప్పును తెలుసుకొని సంజాయిషి ఇచ్చుకునే ప్రయత్నం చేయగా, మంత్రి పొన్నం ప్రభాకర్ అంత వివరణ అవసరం లేదంటూ వ్యాఖ్యానించడంతో..ఎమ్మెల్సీ దాసోజు ఘాటుగా స్పందించారు.




ఈ నేపథ్యంలో సభ మొత్తం రసాభాసగా మారింది. మంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి వాస్తవాలను తెలుసుకోవాలని, గత ప్రభుత్వంలో 2016 నుంచి 2023 వరకు 6,45,479 కొత్త రేషన్ కార్డులు మంజూరయ్యాయని, 2014లో 4 కిలోల బియ్యాన్ని ఆరు కిలోలకు పెంచిన ఘనత గత ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ అన్నారు.

# 12వ రౌండ్ వాణిజ్య వేలంలో ఏడు బొగ్గు బ్లాకుల వేలం

న్యూఢిల్లీ,ఆగష్టు 2:వాణిజ్య మైనింగ్ కోసం బొగ్గు మంత్రిత్వ శాఖ ఈ ఏడాది మార్చి 27న 12వ రౌండ్ బొగ్గు బ్లాకుల వేలాన్ని ప్రారంభించింది. జూలై 28 నుంచి 31 వరకు నిర్వహించిన ఫార్వర్డ్ ఆక్షన్లలో మొత్తం ఏడు బొగ్గు బ్లాకులను విజయవంతంగా వేలం వేశారు. వీటిలో మూడు పూర్తి స్థాయిలో అన్వేషించిన బ్లాకులు కాగా, నాలుగు పాక్షిక అన్వేషిత బొగ్గు బ్లాకులు.

ఈ ఏడు బ్లాకుల్లో కలిపి దాదాపు 1,761.49 మిలియన్ టన్నుల నిల్వలున్నాయి. ఈ బ్లాకుల మొత్తం గరిష్ట సామర్థ్యం (పీఆర్సీ) ఏడాదికి 5.25 మిలియన్ టన్నులు (పాక్షిక అన్వేషిత బొగ్గు బ్లాకులు మినహా).

ఈ వేలంలో తీవ్ర పోటీ నెలకొంది. 26.70 శాతం సగటు రెవెన్యూ వాటా లభించింది. బొగ్గు రంగంలో పరిశ్రమల నిరంతర ఆసక్తినీ, అలాగే విధానపరంగా స్థిరమైన, పారదర్శకమైన ఏర్పాట్ల దిశగా మంత్రిత్వ శాఖ కృషినీ ఇది ప్రతిబింబిస్తుంది. వీటి ద్వారా ఏటా దాదాపు రూ.719.90 కోట్ల ఆదాయం సమకూరనుంది (పాక్షిక అన్వేషిత బొగ్గు బ్లాకులు మినహా). దీని ద్వారా దాదాపు రూ.787.50 కోట్ల మూలధన పెట్టుబడులను ఆకర్షించి.. 7,098 ఉపాధి అవకాశాలు లభించే అవకాశముంది.

2020లో వాణిజ్యపరమైన బొగ్గు తవ్వకం ప్రారంభమైనప్పటి నుంచి, మొత్తం 131 బొగ్గు బ్లాకులను విజయవంతంగా వేలం వేశారు. వీటి ఉత్పత్తి సామర్థ్యం ఏటా 277.31 మిలియన్ టన్నులు. ఈ బ్లాకుల కార్యకలాపాలు మొదలైతే.. దేశీయంగా బొగ్గు ఉత్పత్తిని పెంచడానికి, బొగ్గు రంగంలో దేశ స్వావలంబనకు అవెంతగానో దోహదపడతాయి. వీటి ద్వారా రూ. 39,359 కోట్ల వార్షిక ఆదాయం, రూ. 41,597 కోట్ల మూలధన పెట్టుబడులు, బొగ్గు ఉత్పత్తి ప్రాంతాల్లో 3,74,916 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా.

బొగ్గు రంగాన్ని ఆర్థిక వృద్ధికి కీలక చోదక శక్తిగా మార్చడంలో మంత్రిత్వ శాఖ అంకితభావాన్ని ఈ వ్యూహాత్మక కార్యక్రమాలు పునరుద్ఘాటించాయి. ఈ కార్యక్రమాలు దేశ ఇంధన అవసరాలను తీర్చడమే కాకుండా.. ఆర్థిక స్థిరత్వాన్ని పెంపొందించి, ఉపాధి అవకాశాలను సృష్టిస్తాయి. తద్వారా 'ఆత్మ నిర్భర భారత్' లక్ష్యానికి దోహదపడతాయి.

# 2025 ఖరీఫ్ సీజన్‌లో తగినంత ఎరువుల లభ్యత

న్యూఢిల్లీ,ఆగష్టు 2:ప్రస్తుత 2025 ఖరీఫ్ సీజన్‌లో దేశంలో యూరియా, డీఏపీ, ఎంవోపీ, ఎన్‌పీకేఎస్ వంటి ఎరువుల లభ్యత తగినంతగా ఉంది.

దేశంలో సకాలంలో, తగినంతగా ఎరువులు లభ్యమయ్యేలా చూసేందుకు ప్రభుత్వం ప్రతీ సీజన్‌లోనూ ఈ చర్యలు తీసుకుంటోంది:

ప్రతి పంట కాలం ప్రారంభానికి ముందు.. వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ (డీఏ-ఎఫ్‌డబ్ల్యూ) అన్ని రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదింపులు జరిపి రాష్ట్రాల వారీగా, నెలవారీ ఎరువుల అవసరాన్ని అంచనా వేస్తుంది.

అంచనా వేసిన అవసరాన్ని బట్టి.. నెలవారీ సరఫరా ప్రణాళిక ద్వారా ఎరువుల విభాగం రాష్ట్రాలకు తగిన పరిమాణంలో ఎరువులను కేటాయిస్తుంది. ఎరువుల లభ్యతను నిరంతరం పర్యవేక్షిస్తుంది.

సమీకృత ఎరువుల పర్యవేక్షణ వ్యవస్థ (ఐఎఫ్ఎంఎస్) అనే ఆన్లైన్ వెబ్ ఆధారిత పర్యవేక్షణ వ్యవస్థ ద్వారా దేశవ్యాప్తంగా అన్ని ప్రధాన సబ్సిడీ ఎరువుల స్థితిగతులను పర్యవేక్షిస్తారు.

డీఏ-ఎఫ్‌డబ్ల్యూ, ఎరువుల విభాగం సంయుక్తంగా ఎప్పటికప్పుడు రాష్ట్ర వ్యవసాయాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి.. రాష్ట్ర ప్రభుత్వాల సూచనల మేరకు ఎరువుల పంపిణీకి తగిన చర్యలు తీసుకుంటారు.

ఎరువును నిత్యావసర వస్తువుగా ప్రకటించి, ఎరువుల నియంత్రణ ఉత్తర్వులు- 1985, ఎరువుల (సరఫరా నియంత్రణ) ఉత్తర్వులు- 1973 కింద నోటిఫై చేశారు.

నిత్యావసర వస్తువుల చట్టం-1955, ఎరువుల నియంత్రణ ఉత్తర్వులు-1985 (ఎఫ్‌సీవో) నిబంధనలను ఉల్లంఘించి ఎరువుల బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలకు పాల్పడిన ఎవరైనా వ్యక్తి/ ఎరువుల కంపెనీపై శిక్షాత్మక చర్యలు తీసుకోవడానికి ఎఫ్‌సీవో కింద రాష్ట్ర ప్రభుత్వాలకు తగినంత అధికారం ఉంది.

ప్రతి కొనుగోలుదారుకీ నెలకు 50 బస్తాల సబ్సిడీ ఎరువుల గరిష్ట పరిమితిని ఎరువుల విభాగం విధించింది. అంటే ఏడాదికి 600 బస్తాల సబ్సిడీ ఎరువులు. అంతేకాకుండా, ప్రతి జిల్లా నుంచి మొదటి 20 స్థానాల్లో ఉన్న కొనుగోలుదారుల నెలవారీ జాబితాను ఆయా జిల్లా మెజిస్ట్రేట్ల ఐఎఫ్ఎంఎస్ లాగిన్‌లో అందుబాటులో ఉంచుతారు. తద్వారా వారు తగిన చర్యలు తీసుకునేందుకు అవకాశముంటుంది.

అంతేకాకుండా, ఓ డ్యాష్ బోర్డును కూడా ఎరువుల విభాగం రూపొందించింది.

అధీకృత వినియోగదారులందరికీ ఇది అందుబాటులో ఉంటుంది. రాష్ట్ర వ్యవసాయ శాఖలు, జిల్లా కలెక్టర్లు, రాష్ట్ర మార్కెటింగ్ సమాఖ్యలు సులభంగా పర్యవేక్షించడానికి వీలుగా డ్యాష్ బోర్డును రూపొందించారు. ఐఎఫ్ఎంఎస్, ఇ-ఉర్వరక్ డ్యాష్ బోర్డు పోర్టళ్ల ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఎరువుల లభ్యత, సరఫరాను పర్యవేక్షిస్తున్నాయి.

రసాయనాలు, ఎరువుల శాఖ సహాయ మంత్రి శ్రీమతి అనుప్రియా పటేల్ లోక్‌సభలో ఓ ప్రశ్నకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో ఈ సమాచారాన్ని అందించారు.

# వృద్ధులపట్ల గౌరవాన్ని కలిగి ఉండాలి : వి.బి నిర్మలా గీతాంబ




వరంగల్, ఆగష్టు 2: ప్రతి ఒక్కరు వృద్ధుల పట్ల గౌరవాన్ని కలిగివుండాలని, వారి పట్ల మర్యాదగా ప్రవర్తించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి నిర్మలా గీతాంబ అన్నారు. శనివారం ఎంజీఎంహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్ కుమార్ అధ్యక్షతన సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్వర్యంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ సహకారంతో ఎంజీఎం హాస్పిటల్ సిబ్బందికి 2007 తల్లిదండ్రులు-వృద్ధుల పోషణ-సంరక్షణ చట్టం, 2011 నియామావళిపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వృద్ధుల పట్ల వివక్ష పెరుగుతూపోతున్న దృష్ట్యా వారికి తగిన గౌరవం దక్కాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం 2007లో చట్టాన్ని తీసుకువచ్చిందని అన్నారు.

ఈ చట్ట ప్రకారం ప్రభుత్వ కార్యాలయాలలో, హాస్పిటల్లలో వయోవృద్ధులకు తగిన విధంగా ప్రత్యేక వసతులు కల్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి మనిషి జీవితంలో వృద్ధాప్యం తప్పదని, ఇప్పుడు వారికి ఇచ్చే మర్యాద, గౌరవం తదుపరి తరం పిల్లలు మనకి ఇస్తారనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలని అన్నారు. చట్టం వారికి కల్పించిన హక్కులను, వాటి మూలంగా వారికి సంక్రమించే అధికారాలను వివరించారు.వృద్ధుల పట్ల అమర్యాదగా ప్రవర్తించినా, ఇతరత్రా ఇబ్బందులకు గురిచేసినా చట్ట ప్రకారం శిక్షార్హులవుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం. సాయికుమార్, ఎంజీఎంహెచ్ ఆర్ఎంఓ డాక్టర్ వసంతరావు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షులు కొండ్రెడ్డి మల్లారెడ్డి, హనుమకొండ అధ్యక్షులు దామెర నర్సయ్య, కళాంపుర దామోదర్, హెల్పేజ్ ఇండియా రాష్ట్ర కోఆర్డినేటర్ పి.శ్యామ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# నేను రాజును కాను.. కావాలనుకోవడం లేదు.. రాహుల్ గాంధీ వ్యాఖ్యలు..

న్యూఢిల్లీ,ఆగష్టు 2: కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ శనివారం యాన్యువల్ లీగల్ కాన్‌క్లేవ్‌లో పాల్గొన్నారు. రాహుల్ ప్రసంగం సభలో ఆయన మద్దతుదారులు నినదించారు. 'ఇస్ దేశ్ కా రాజా కైసా హో.. రాహుల్ గాంధీ జైసా హో' అని పలువురు నినదించగా దానికి రాహుల్ గాంధీ స్పందిస్తూ.. తాను రాజును కాదని.. కావాలని అనుకోవడం లేదన్నారు. అయినా పలువురు అలాగే నినాదాలు చేశారు. తాను రాజుగా మారాలని కూడా కోరుకోవడం లేదని.. తాను రాజును వ్యతిరేకిస్తున్నానని.. నేను ఆ భావనకు కూడా వ్యతిరేకినన్నారు. రాహుల్ గాంధీ గతంలో ప్రధానిని ఉద్దేశించి 'రాజు'గా అభివర్ణిస్తూ ప్రజల గొంతుక వినడం లేదంటూ ఆరోపించారు.

'రాజ్యాంగ సవాళ్లు : దృక్కోణాలు, మార్గాలు' అనే థీమ్ శనివారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో లీగల్ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘంపై మరోసారి విమర్శలు గుప్పించారు. దేశంలో ఎన్నికల వ్యవస్థ ఇప్పటికే చచ్చిపోయిందని మండిపడ్డారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని.. దాదాపు 70 నుంచి వంద స్థానాల్లో రిగ్గింగ్ జరిగి ఉండవచ్చన్నారు. ఒకవేళ 15 సీట్లలోనే రిగ్గింగ్ జరిగి ఉంటే మోదీకి ప్రధానిగా అవకాశమే లభించేది కాదన్నారు. స్వల్ప మెజారిటీతో మోదీ ప్రధాని పీఠాన్ని అలంకరించారన్న విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలన్నారు. ఇంకా తక్కువగా సీట్లు వచ్చి ఉంటే ఆయన ప్రధాని పీఠం వరకు వెళ్లేవారు కాదన్నారు. కర్ణాటక రాష్ట్రంలోని ఒక అసెంబ్లీ స్థానంలో ఉన్న ఓటర్ల ఫొటోలు, పేర్లను తమ పార్టీ తనిఖీ చేయగా మొత్తం 6.5 లక్షల ఓటర్లలోని 1.5 లక్షలలో ఓటర్లు నకిలీయేనని తేలిందని రాహుల్ తెలిపారు. ఈ సమాచారాన్ని కాంగ్రెస్ విడుదల చేశాక ఎన్నికల వ్యవస్థలో ప్రకంపనలు రావడాన్ని అందరూ చూస్తారన్నారు. ఆటం బాంబులా కుదిపేస్తుందన్న ఆయన.. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన కేంద్ర ఎన్నికల సంఘం కొందరి హస్తాల్లోకి వెళ్లిపోయిందని, దాని ఉనికే ప్రశ్నార్థకంగా మారిందని విమర్శించారు.

గతంలో తగిన సాక్ష్యాధారాలు లేక ఈ అంశంపై మాట్లాడలేకపోయేవాడినన్నారు. తమ చేతలో ప్రస్తుతం వందశాతం సాక్ష్యాలు ఉన్నాయని.. అదే ధీమాతో ప్రస్తుతం మాట్లాడుతున్నానన్నారు. తాను లోక్‌సభ ఎన్నికల రిగ్గింగ్‌కు సంబంధించిన ఆధారాలను చూపిస్తే, కొందరు సంభ్రమాశ్చర్యాలకు గురవుతున్నారని.. అదెలా సాధ్యమైం దని ప్రశ్నిస్తున్నారన్నారు. కానీ, అది సాధ్యమేనని.. నిజంగానే జరుగుతోందన్నారు. 2014 నుంచే తనకు అనుమానంగా ఉందన్నారు. అప్పటి గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల విషయం లోనూ సందేహాలు ఉన్నాయన్నారు. పూర్తిగా మెజారిటీతో కొందరికి వచ్చినా ఏకపక్ష విజయాలు తనలో అనుమానాలు పెంచాయన్నారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లోనైతే కాంగ్రెస్‌కు ఒక్క లోక్‌సభ సీటు రాలేదని.. ఆయా ఆ ఫలితాలు తనను ఆశ్చర్యపరిచాయన్నారు.

# 'పీఎంకేఎస్‌వై' కింద దేశవ్యాప్తంగా 1601 ప్రాజెక్టుల కోసం రూ.8,853 కోట్ల నిధుల మంజూరుకు ఆమోదం

న్యూఢిల్లీ,ఆగష్టు 2:కేంద్ర ఆహార తయారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ "ప్రధాన మంత్రి కిసాన్ సంపద యోజన" (పీఎంకేఎస్‌వై) పేరిట ఒక సాముదాయక పథకాన్ని అమలు చేస్తోంది. దీనికింద ఈ ఏడాది జూన్ 30 నాటికి రూ.30,656.57 కోట్ల అంచనా వ్యయంతో 1601 ప్రాజెక్టులకు ఆమోదం ఇవ్వగా, రూ.8,853.38 కోట్ల మేర ఆర్థిక సహాయం మంజూరుకు ఆమోదం తెలిపింది.

'పీఎంకేఎస్‌వై'లో అంతర్భాగమైన ఇతర పథకాల కింద జనవరి 2024 నుంచి జూన్ 2025 వరకూ 52 ప్రాజెక్టులకు ఆమోదముద్ర వేయగా, వాటిలో 1 ఆహార భద్రత-నాణ్యత మౌలిక సదుపాయాలకు భరోసా పథకం కింద మంజూరైంది. వీటి వివరాలను అనుబంధంలోని పట్టికలో చూడవచ్చు.

పంటకోత అనంతర మౌలిక సదుపాయాల కల్పన, ఆహార తయారీ సౌకర్యాల సృష్టి వల్ల ఫలసాయం అందిన తర్వాత సంభవించే నష్టాల తగ్గింపునకు తోడ్పడుతుంది. తదనుగుణంగా 'పీఎంకేఎస్‌వై' పరిధిలోని పథకాల ద్వారా ఆహార తయారీ/సంరక్షణ మౌలిక సదుపాయాల కల్పన కోసం ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఆర్థిక సహాయం రూపంలో ప్రభుత్వం చేయూతనిస్తుంది. వీటిలో ఇతరత్రా అంశాలతోపాటు పంటకోత తర్వాత నష్టాలను తగ్గించే శీతల గిడ్డంగులు, శీతల సదుపాయ వాహనాలు ఉంటాయి.

నాబార్డ్ పరిధిలోని కన్సల్టెన్సీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ (నాబ్‌కాన్స్) 2020లో నిర్వహించిన మూల్యాంకన అధ్యయనం అనంతరం మంత్రిత్వ శాఖకు నివేదిక సమర్పించింది. "ఆహార తయారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ సహాయంతో సమీకృత శీతల గిడ్డంగుల సముదాయాల నిర్మాణం, విలువ జోడింపు మౌలిక సదుపాయాల పథకం కింద నిర్మించిన యూనిట్ల ప్రభావం"పై 'నాబ్‌కాన్స్' ఈ అధ్యయనం నిర్వహించింది. ఈ చర్యలన్నిటి ఫలితంగా అన్ని రంగాల్లో వృథా కొంత తగ్గినట్లు తేలింది. అయితే, పండ్లు-కూరగాయలు, పాడి-మత్స్య రంగాల్లో వృథా గణనీయంగా తగ్గిందని నివేదిక స్పష్టం చేసింది.

# ఆగస్టు 16 నుండి సెప్టెంబర్ 14 వరకు అమృత ఉద్యాన్ వేసవి వార్షికోత్సవాలు

న్యూఢిల్లీ,ఆగష్టు 2:అమృత ఉద్యాన్ వేసవి వార్షికోత్సవాలు ఆగస్టు 16 నుండి సెప్టెంబర్ 14, 2025 వరకు ప్రజలకు అందుబాటులో ఉంటాయి. ఆ కాలంలో, ఉద్యాన్ ఉదయం 10:00 నుండి సాయంత్రం 6:00 వరకు తెరిచి ఉంటుంది, చివరి ప్రవేశం సాయంత్రం 5:15 గంటలకు ఉంటుంది. నిర్వహణ కోసం అన్ని సోమవారాల్లో ఉద్యాన్ మూసివేయబడుతుంది.

జాతీయ క్రీడా దినోత్సవం మరియు ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 29న అథ్లెట్లు మరియు క్రీడాకారులు మరియు సెప్టెంబర్ 5న ఉపాధ్యాయులు వరుసగా అమృత ఉద్యాన్‌కు ప్రత్యేక ప్రవేశం పొందుతారు.

సందర్శకుల ప్రవేశం మరియు నిష్క్రమణ నార్త్ అవెన్యూ రోడ్ సమీపంలో ఉన్న గేట్ నంబర్ 35 నుండి జరుగుతుంది. అమృత్ ఉద్యాన్ ప్రవేశం ఉచితం.తమ స్లాట్‌లను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చు. వాక్-ఇన్ సందర్శకులు గేట్ నంబర్ 35 వెలుపల ఉంచిన సెల్ఫ్-సర్వీస్ కియోస్క్‌లను ఉపయోగించి నమోదు చేసుకోవచ్చు.

సందర్శకులు మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ కీలు, పర్సులు, హ్యాండ్‌బాగులు, వాటర్ బాటిళ్లు, బేబీ మిల్క్ బాటిళ్లు మరియు గొడుగులను ఉద్యాన్ లోపల తీసుకెళ్లవచ్చు. ఇవి తప్ప, మరే ఇతర వస్తువులు అనుమతించబడవు.

గార్డెన్ ట్రైల్‌లో బాల్ వాటిక, హెర్బల్ గార్డెన్, బోన్సాయ్ గార్డెన్, సెంట్రల్ లాన్, లాంగ్ గార్డెన్ మరియు సర్క్యులర్ గార్డెన్ ఉంటాయి. సర్క్యూట్ అంతటా ఉంచబడిన ఖీఖీ కోడ్‌లు సందర్శకులు వివిధ మొక్కలు మరియు డిజైన్ లక్షణాల గురించి సమాచారాన్ని యాక్సెస్ చేయడానికి అనుమతిస్తాయి.

ఈ సంవత్సరం, సందర్శకులు కొత్త ఫీచర్‌ను అనుభవిస్తారు - బాబ్లింగ్ బ్రూక్. ప్రకృతి దృశ్య మండలంలో ఇవి ఉన్నాయి:

క్యాస్కేడ్‌లు, శిల్పకళా చిమ్ములు, మెట్ల రాళ్ళు మరియు ఎత్తైన ప్రతిబింబించే కొలనుతో కూడిన మెలికలు తిరిగిన నీటి ప్రవాహం

రిఫ్లెక్సాలజీ మార్గాలు, పంచత్వ ట్రైల్స్ మరియు అటవీ-ప్రేరేపిత సౌండ్‌స్కేప్‌లతో కూడిన ప్రశాంతమైన బన్యన్ గ్రోవ్ గడ్డి దిబ్బలు మరియు ఆకర్షణీయమైన ఇంద్రియ అనుభవాలను అందించే క్యూరేటెడ్ తోటలతో కూడిన ప్రశాంతమైన హెర్బల్ మరియు ప్లూమెరియా గార్డెన్

# మధిరలో ఘనంగా పింగళి వెంకయ్య జయంతి

ఖమ్మం, ఆగష్టు 2:మధిర పట్టణంలోని శ్రీనిధి జూనియర్ కళాశాలలో మన దేశ జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి శ్రీనిధి విద్యా సంస్థల చైర్మన్ అనిల్ కుమార్ నెహ్రూ పూలమాల వేసి నివాళి అర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ టి.రమేశ్‌బాబు మాట్లాడుతూ.. పింగళి వెంకయ్య బహు భాషా పండితుడని, గొప్ప దేశభక్తి వాది అని కొనియాడారు. పింగళి వెంకయ్య మన తెలుగు వాడు కావడం మనకెంతో గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# రాజకీయ లబ్ధి కోసమే 'ఆపరేషన్ సిందూర్' : తమ్మినేని వీరభద్రం




ఖమ్మం, ఆగష్టు 2:ఆపరేషన్ సింధూర్ పేరుతో పాకిస్తాన్‌పై చేసిన దాడిని బీజేపీ తన రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటుందని, పెహల్గాం దాడిలో పాల్గొన్న వాళ్లలో ఎంత మంది పాకిస్తాన్ ఉగ్రవాదులను చంపారో కేంద్ర ప్రభుత్వం చెప్పలేకపోతుందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం అన్నారు. శనివారం సీపీఎం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆపరేషన్ సింధూర్ పై విపక్ష సభ్యులు అడిగిన ప్రశ్నలకు కేంద్రం వద్ద సరైన సమాధానం లేదన్నారు. ప్రధాని మోదీ తన అనుకూల మీడియాతో ప్రపంచానికి అబద్ధాలు వల్లేవేశారని కానీ అంతర్జాతీయ ఛానెళ్లు భారత ప్రభుత్వ మీడియాను అవహేళన చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ హిందూ ? ముస్లింలను రెచ్చగొడుతూ వక్ర బుద్ధిని చూపిస్తున్నాయని దుయ్యబట్టారు. భారత్ ? పాక్ యుద్ధాన్ని తానే ఆపానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రచారం చేసుకుంటుంటే అది నిజామా? అబద్ధమా? అని విపక్ష సభ్యులు అడిగితే సమాధానం చెప్పలేకపోతున్నారని మండిపడ్డారు. ఇది మోదీ వైఫల్యానికి నిదర్శనమన్నారు.

ముస్లిం, క్రిస్టియన్ ఓట్లను తగ్గించడమే లక్ష్యంగా

ట్రంప్ మోదీకి మిత్రుడైనప్పటికీ 25 శాతం టారిఫ్ వేయడంలో వెనుకంజ వేయడం లేదన్నారు. ప్రస్తుతం బ్రిటన్‌తో జీరో టారిఫ్ తో మోదీ ఒప్పందం చేసుకున్నారని, ఇది భవిష్యత్‌లో వ్యవసాయ ఆధారిత ఉత్పత్తులు, వస్తువులపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. బీహార్‌లో ఓటర్ల తొలగింపు పై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిందని, ఈసీ, బీజేపీ వ్యవహరిస్తున్న తీరును సీపీఎం తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. ముస్లిం, క్రిస్టియన్ ఓట్లను తగ్గించడమే లక్ష్యంగా బీజేపీ పని చేస్తుందని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల వాగ్దానాలను అమలు చేయడంలో విఫలమయ్యారని, ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిందేనన్నారు. స్థానిక ఎన్నికలలో ప్రస్తుతం ఒంటరిగా వెళ్లే ఆలోచనలో ఉన్నామని, అప్పటి పరిస్థితులను బట్టి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బాధ్యత తీసుకోవాలి

సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారని, ఏపీలో కలిపిన ఐదు గ్రామాలను తిరిగి తీసుకురావడంపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రస్తుత ప్లాన్‌తో నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్ట్ తో భద్రాచలం కు తీవ్ర ముప్పు పొంచిఉందని, భద్రాద్రి దేవాలయం కాపాడే బాధ్యత తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకే ఇస్తున్నారని నిజమైన అర్హులకే ఇండ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ పై బీజేపీ దృష్టి సారించి అమలు పరిచే విధంగా కేంద్రంపై బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు ఒత్తిడి తేవాలన్నారు.

సీతారామ ప్రాజెక్ట్ కు జిల్లాలోని ముగ్గురు మంత్రులు ఇప్పటికీ నాలుగు సార్లు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారని ఎద్దేవా చేశారు. పాత డిజైన్ ప్రకారమే ప్రాజెక్ట్ నిర్మించి ఈ ప్రాంత రైతాంగానికి నీళ్లు ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో ఉమ్మడి ఖమ్మం, మహబూబాబాద్ జిల్లా రైతులతో కలిసి అవసరమైతే ఆందోళనలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారి రవి కుమార్, జిల్లా కార్యదర్శి మెచ్చ వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు యలమంచిలి రవికుమార్, అన్నవరపు కనకయ్య, అన్నవరపు సత్యనారాయణ, ఏ జే రమేశ్, ఎం.జ్యోతి, కారం పుల్లయ్య, ఎం బీ.నర్సారెడ్డి, లక్కి బాలరాజు పాల్గొన్నారు.

# దిబ్రూఘర్‌లోని ప్రముఖ పండితుడు, సాహితీవేత్త డాక్టర్ నాగెన్ సైకియాను కలిసిన కేంద్ర మంత్రి శ్రీ సర్బానంద సోనోవాల్

న్యూఢిల్లీ,ఆగష్టు 2:కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్ మరియు జలమార్గాల మంత్రి శ్రీ సర్బానంద సోనోవాల్ ప్రముఖ పండితుడు, సాహితీవేత్త మరియు ఆలోచనాపరుడు డాక్టర్ నాగెన్ సైకియాను దిబ్రూఘర్‌లోని తన నివాసంలో కలిసి ఆయన శ్రేయస్సు గురించి విచారించి, వివిధ అంశాలపై సంభాషణలో పాల్గొన్నారు.



డాక్టర్ సైకియాకు మంచి ఆరోగ్యం మరియు దీర్ఘాయుష్షు ఉండాలని కోరుకుంటున్న శ్రీ సర్బానంద సోనోవాల్, "డాక్టర్ నాగెన్ సైకియా తత్వశాస్త్రం మరియు అమూల్యమైన రచనలు జాతీయ జీవితాన్ని సుసంపన్నం చేశాయి మరియు యువతరానికి స్ఫూర్తినిస్తూనే ఉన్నాయి. ఆయనను కలవడం, ఆయన ఆశీర్వాదాలు పొందడం మరియు ఆయన తెలివైన సలహా నుండి ప్రయోజనం పొందడం ఒక అదృష్టం. ఆయన మాటలు నిజంగా స్ఫూర్తిదాయకంగా ఉన్నాయి."




# మఖానా ఉత్పత్తిలో బీహార్ అగ్రగామి: శివరాజ్ సింగ్ చౌహాన్




న్యూఢిల్లీ,ఆగష్టు 2:ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (ఖఓ-ఐమోంఔ) యోజన 20వ విడత విడుదల శుభ సందర్భంగా, కేంద్ర వ్యవసాయ ఉ రైతు సంక్షేమ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ బీహార్‌లోని పాట్నాలో రైతులు, అధికారులు మరియు ప్రముఖులతో కూడిన భారీ సభలో ప్రసంగించారు. పవిత్ర సావన్ మాసంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీహార్ ఉప ముఖ్యమంత్రి శ్రీ విజయ్ సిన్హా, సహకార మంత్రి శ్రీ ప్రేమ్ కుమార్ మరియు ఇతర ప్రముఖ అధికారులు పాల్గొన్నారు.

తన ప్రసంగంలో, శ్రీ చౌహాన్ రైతులను, ముఖ్యంగా పెద్ద సంఖ్యలో హాజరైన మహిళలను సత్కరించారు మరియు వారి కృషి మరియు సహకారాన్ని అభినందించారు. వ్యవసాయం భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక మరియు రైతులు దాని ఆత్మ అని ఆయన అన్నారు. ఈ రైతులకు సేవ చేయడం మా అంతిమ బాధ్యత అని ఆయన అన్నారు.

బీహార్ యొక్క గొప్ప సాంస్కృతిక మరియు వ్యవసాయ వారసత్వాన్ని ప్రస్తావిస్తూ, శ్రీ చౌహాన్ ఈ భూమి యొక్క వైభవం గురించి మాట్లాడారు, ఇది భగవంతుడు బుద్ధుని తపస్సు మరియు మా గంగాదేవి ఆశీర్వాదాల ద్వారా పవిత్రం చేయబడింది. ప్రపంచవ్యాప్తంగా ప్రశంసించబడిన బీహార్ కష్టపడి పనిచేసే ప్రజలను ఆయన ప్రశంసించారు.

బీహార్ జ్ఞానం మరియు శ్రమశీలత యొక్క సంప్రదాయాన్ని అభినందిస్తూ, "ఈ రాష్ట్రం యొక్క జ్ఞానం మరియు శ్రమశీలత యొక్క వారసత్వం సాటిలేనిది. ఈ భూమి మహాత్మా గాంధీ చంపారన్ సత్యాగ్రహాన్ని చూసింది, ఇది భారతదేశ స్వాతంత్ర్య పోరాటానికి కొత్త దిశను ఇచ్చింది."

వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చాలనే ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సంకల్పాన్ని కేంద్ర మంత్రి పునరుద్ఘాటించారు. పిఎం కిసాన్ పథకం కింద ఇప్పటివరకు రూ. 3,77,000 కోట్లకు పైగా రైతుల ఖాతాలకు నేరుగా బదిలీ చేయబడ్డాయి. ఈ సందర్భంగా, దేశవ్యాప్తంగా లక్షలాది రైతు కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించే విధంగా రైతుల ఖాతాల్లో రూ. 20,000 కోట్లకు పైగా జమ చేయబడింది.

ముఖ్యంగా తక్కువ ఉత్పాదకత ఉన్న ప్రాంతాల్లో హెక్టారుకు వ్యవసాయ ఉత్పాదకతను పెంచడానికి ప్రధానమంత్రి ధన్ ధాన్య యోజన వంటి ప్రయత్నాలను శ్రీ చౌహాన్ నొక్కిచెప్పారు. బీహార్‌లో మఖానా ఉత్పత్తి యొక్క గణనీయమైన సహకారాన్ని మరియు వ్యవసాయ శాస్త్రాన్ని పొలాలతో అనుసంధానించడానికి నిరంతర ప్రయత్నాలను ఆయన హైలైట్ చేశారు.

ఎరువులు మరియు పురుగుమందుల సకాలంలో మరియు తగినంత లభ్యతను కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. పంట విఫలమైన సందర్భంలో పరిహారం అందించడానికి వివిధ పథకాల కింద చేస్తున్న ప్రయత్నాల గురించి కూడా ఆయన తెలియజేశారు. ఇప్పుడు పంటలను కనీస మద్దతు ధర వద్ద సేకరిస్తున్నామని, దీనికి ఉత్పత్తి ఖర్చుపై 50 శాతం లాభం జోడించబడిందని ఆయన అన్నారు. ఇది ప్రభుత్వం యొక్క రైతు కేంద్రీకృత విధానాన్ని ప్రతిబింబిస్తుంది.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో రైతుల సంక్షేమమే మా అగ్ర ప్రాధాన్యత అని శ్రీ చౌహాన్ పునరుద్ఘాటించారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో రైతుల సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలను హైలైట్ చేస్తూ, చౌహాన్ మాట్లాడుతూ, డీబీటీ (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) సహాయంతో ప్రభుత్వం రైతుల ఖాతాల్లోకి నేరుగా సహాయం చేరేలా చూస్తోందని అన్నారు. "గతంలో, రైతులకు ప్రభుత్వం పంపిన రూ. 1 పైసా మాత్రమే వచ్చేది, కానీ ఇప్పుడు వారికి ఎటువంటి లీకేజీ లేకుండా మొత్తం అందుతుంది" అని ఆయన అన్నారు.

# మంత్రి కొండా సురేఖకు నాంపల్లి కోర్టు షాక్..

హైదరాబాద్, ఆగష్టు 2:మంత్రి కొండా సురేఖకు నాంపల్లి కోర్టు షాక్ ఇచ్చింది. మంత్రిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆదేశించింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు దాఖలు చేసిన పరువు నష్టం కేసులో కోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఫోన్ ట్యాంపింగ్, డ్రగ్స్, టాలీవుడ్ హీరోయిన్ సమంత విడాకుల వ్యవహారంలో ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు కేటీఆర్ కోర్టును ఆశ్రయించారు. కేటీఆర్‌పై నిరాధార ఆరోపణలు చేసిన మంత్రి సురేఖపై చర్యలు తీసుకోవాలంటూ పోలీసులను నాంపల్లి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ప్రాథమిక సాక్ష్యాలను పరిశీలించిన నేపథ్యంలో నిందితురాలు కొండా సురేఖపై ఆగస్టు 21లోగా క్రిమినల్ కేసు నమోదు చేసి నిందితురాలికి నోటీను జారీ చేయాలని స్పష్టం చేసింది. కేటీఆంపైన మంత్రి నిరాధారమైన ఆరోపణలు చేశారంటూ కేటీఆర్ తరఫున న్యాయవాది వాదనలతో కోర్టు ఏకీభవించింది. ఫిర్యాదుతోపాటు సాక్ష్యుల వాంగ్మూలాలు, డాక్యుమెంట్ల పరిశీలించిన తర్వాత ఆదేశాలు జారీ చేసింది.

# బిడ్డకు తల్లిపాలు వెయ్యి రెట్ల బలంతో సమానం..

## – లక్ష్మీపురం పీహెచ్‌సీ వైద్యాధికారి మణికేశ్వర్ రెడ్డి

కరీంనగర్, ఆగష్టు 2:అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలు వెయ్యి రెట్ల బలంతో సమానమని లక్ష్మీపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మణికేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320జీ, లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం రీజియన్ 9 జోన్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా శనివారం నగర పాలక సంస్థ పరిధిలోని లక్ష్మీపూర్ ఆరోగ్య కేంద్రంలో తల్లిపాల ప్రాముఖ్యతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

వైద్యాధికారి మణికేశ్వర్ రెడ్డి ముఖ్యతిథిగా హాజరై తల్లిపాల ఆవశ్యకత గురించి వివరించారు. పుట్టిన బిడ్డలకు తల్లిపాలు పట్టించడం వల్ల త్వరగా రోగ నిరోధిక శక్తి పెరిగి బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఎదుగుతారని పేర్కొన్నారు. సహజంగా లభించే అన్ని రకాల ప్రొటీన్లు, విటమిన్లు తల్లి పాలలో ఉంటాయనీ, బాలింతలు అపోహలు వీడి బిడ్డలకు తల్లిపాలు పట్టించాలని సూచించారు. లయన్స్ క్లబ్ సభ్యులు అవగాహన వారోత్సవాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.అనంతరం క్లబ్ సభ్యులు గర్భిణులకు, బాలింతలకు పాలు, పండ్లు, బ్రెడ్లు, గుడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు ఎల్లప్ప, సెక్రెటరీ సారయ్య, కోశాధికారి రాజేంద్రకుమార్, లయన్ సత్యనారాయణ, రంగమ్మ, మనీషా అగర్వాల్, పీహెచ్సీ సిస్టర్ పారిజాతం, ఐసీడీఎస్ సూపర్వైజర్ మమత తోపాటు తల్లులు పాల్గొన్నారు.

# ఓరుగంటి రాజేశ్వరమ్మ పార్థివ దేహానికి మాజీ ఎమ్మెల్యే నివాళి



కొల్లాపూర్, ఆగష్టు 2: కొల్లాపూర్ మండలం సింగోటం శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయ ప్రధాన అర్చకులు సంపత్ కుమార్ శర్మ సతీమణి ఓరుగంటి రాజేశ్వరమ్మ శుక్రవారం రాత్రి గుండె పోటుతో మరణించారు.

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి శనివారం వారి స్వగృహానికి వెళ్లి పార్థివ దేహానికి పూలమాలలతో నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

నిత్యం దైవకార్యంలో ఆధ్యాత్మిక సేవలో ఉన్న ఓరుగంటి సంపత్ కుమార్ శర్మ, కుమారుడు ఓరుగంటి సతీష్ కుమార్ శర్మలకు తోడు ఉండటంతో పాటు అందర్నీ ఎంతో ఆప్యాయంగా పిలిచే ఓరుగంటి రాజేశ్వరమ్మ మృతి కుటుంబ సభ్యులకు మాత్రమే కాక గ్రామస్థులకు భక్తులకు తీరని లోటు ఏర్పడిందని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారితో పాటు మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పౌరులు అడవుల నరికివేతను నివారించడం మరియు మరిన్ని చెట్లను నాటడం అనే సంప్రదాయాన్ని స్వీకరించాలి




న్యూఢిల్లీ,ఆగష్టు 2:కేంద్ర పర్యావరణం, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రి శ్రీ భూపేందర్ యాదవ్, కేంద్ర గృహనిర్మాణం మరియు పట్టణ వ్యవహారాల మంత్రి; మరియు విద్యుత్ శాఖ మంత్రి శ్రీ మనోహర్ లాల్, భారత ప్రభుత్వం యొక్క 'ఏక్ పెడ్ మా కే నామ్' కార్యక్రమం కింద పర్యావరణ పరిరక్షణ మరియు సమాజ భాగస్వామ్యాన్ని సూచించే ఆకుపచ్చ వారసత్వం 'మాతృ వాన్' చౌరవను ఉత్సవంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని హర్యానా అటవీ శాఖ ఈరోజు గురుగ్రామ్‌లో నిర్వహించింది.? ఈ సందర్భంగా పరిశ్రమలు మరియు అటవీ (హర్యానా) మంత్రి శ్రీ రావు నర్బీర్ సింగ్, రాష్ట్ర ప్రభుత్వం నుండి సీనియర్ ప్రజా ప్రతినిధులు మరియు అధికారులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మాతృ వాన్' చౌరవ – ప్రకృతి స్ఫూర్తితో కూడిన హరిత ప్రయత్నాల ద్వారా తరాలను పోషించడానికి అంకితం చేయబడిన ఇతివృత్త ఆధారిత పట్టణ అడవి – గురుగ్రామ్–ఫరీదాబాద్ రోడ్డు వెంబడి ఆరావళి కొండ ప్రాంతంలో 750 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేయబడుతుంది. ఇది జీవవైవిధ్యం, ప్రజా శ్రేయస్సు మరియు పట్టణ స్థిరత్వానికి దోహదపడే ఒక ప్రత్యేకమైన పర్యావరణ మరియు సాంస్కృతిక ప్రదేశంగా ఊహించబడింది. ఆఖీ భాగస్వాములు, నివాసి సంక్షేమ సంఘాలు (ఖీచింలు), ఔఉాలు, బహుళజాతి సంస్థలు (ఓఔలు), పాఠశాల పిల్లలు మరియు ప్రభుత్వ సంస్థలతో కూడిన బహుళ–భాగస్వామ్య సహకారం ద్వారా ఈ దార్శనికతను సాధించవచ్చు. ?

కార్బన్ ఉద్గారాలు మానవాళికి ఎలా అగ్రగామి ప్రపంచ సవాలుగా మారాయో శ్రీ మనోహర్ లాల్ ఈ కార్యక్రమంలో ప్రసంగించారు. ఈ సవాలును ఎదుర్కోవడానికి కార్బన్ సంగ్రహణ సాంకేతికతను ఉపయోగించడంతో పాటు, అటవీ నిర్మూలనను నివారించడం మరియు వాన్ మిత్రాలుగా మారడానికి మరిన్ని చెట్లను నాటడం అనే సంప్రదాయాన్ని పౌరులు స్వీకరించాలని మంత్రి ప్రోత్సహించారు. భారతదేశంలో శిలాజేతర ఇంధన ఆధారిత విద్యుత్ ఉత్పత్తిలో పెరుగుతున్న వాటా కార్బన్ ఉద్గారాలను తగ్గించడంలో ఎలా చాలా దూరం వెళుతుందో ఆయన నొక్కి చెప్పారు. దేశంలోని ఇంధన మిశ్రమంలో పునరుత్పాదక ఇంధన వనరుల వాటా ఇప్పటికే 50% దాటిందని ఆయన తెలియజేశారు. అంతేకాకుండా, గురుగ్రామ్ వంటి మెట్రో నగరాలు గ్రీన్ బిల్డింగ్‌లు, వన్యప్రాణుల సఫారీల ద్వారా పర్యావరణ పర్యాటకం, థీమ్ ఆధారిత జీవవైవిధ్య ఉద్యానవనాలు వంటి మార్గదర్శక కార్యక్రమాలలో ఇతరులకు ఆదర్శంగా మారాలని మంత్రి అన్నారు.

శ్రీ భూపేందర్ యాదవ్ తన ప్రసంగంలో, 'మాతృ వ్యాన్' పచ్చదనం మొత్తం ఢిల్లీ ఎన్‌సిఆర్ కి గుండె మరియు ఊపిరితిత్తుల వలె పనిచేస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ముళ్ళ పొదలతో కప్పబడిన ఈ అటవీ భూమిని అందించడంలో మరియు ఆరావళికి చెందిన చెట్ల జాతులను నాటడం ద్వారా దానిని 'మాతృ వ్యాన్'గా అభివృద్ధి చేయడంలో భారీ పాత్ర పోషించినందుకు హర్యానా ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రాజెక్ట్ యువకులు మరియు సీనియర్ పౌరులు సహా ప్రజలకు ఆరోగ్యకరమైన మరియు ఒత్తిడి లేని జీవితాన్ని గడపడానికి ప్రశాంతమైన వాతావరణాన్ని అందిస్తుంది. గురుగ్రామ్ పరిశుభ్రమైన మరియు ఆకుపచ్చ నగరంగా మారుతుంది, ఇది ఇతరులకు 'ఆదర్శ మిలీనియం నగరం'కి అగ్రగామి ఉదాహరణగా ఉంటుంది అని శ్రీ యాదవ్ అన్నారు.

స్థానిక వృక్ష జాతులను నాటడం ద్వారా కొండ శ్రేణిని పునరుజ్జీవింపజేయడానికి ఆరావళిని పచ్చదనం చేయాలనే ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికతకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. మానవ జాతిని పెంపొందించడంలో ప్రకృతి మాత యొక్క ముఖ్యమైన పాత్రను మరియు 'ఏక్ పెడ్ మా కే నామ్' చొరవ ప్రధానమంత్రి దార్శనికత ప్రకారం ప్రకృతి మాత పట్ల కృతజ్ఞతను వ్యక్తపరచడంలో ఒక మార్గదర్శక ప్రయత్నం అని కూడా ఆయన గుర్తించారు. అదే విధంగా, మంత్రి మిషన్ లైఫ్ కింద వివిధ అంశాలను – సేవ్ ఫుడ్, సేవ్ వాటర్, సేవ్ ఎనర్జీ, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ఈ–వేస్ట్ మేనేజ్‌మెంట్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించండి – అనే అంశాలను ప్రపంచానికి అందించారు.

# హస్తిన యాత్రలో అర్ధ శతకం సాధించిన సీఎం

## –బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సెటైర్లు

హైదరాబాద్ ఆగష్టు 2 (ఎక్స్‌ప్రెస్ న్యూస్);: హస్తిన యాత్రలో సీఎం రేవంత్ రెడ్డి అర్ధ శతకం సాధించారు.. 50 ట్రిప్స్.. జీరో రిజల్ట్స్ అని పేర్కొంటూ సీఎంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సెటైర్లు వేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఫైల్స్‌తో కాకుండా? ఫ్లైట్ బుకింగ్స్‌తో రేవంత్ రెడ్డి నడిపిస్తున్నారు. రేవంత్ ఢిల్లీ యాత్రలకు.. తెలంగాణకు ఏ సంబంధం లేదు అని కేటీఆర్ స్పష్టం చేశారు.కాంగ్రెస్ పాలన చేపట్టాక రేవంత్ చేసిన మూడు పనులు ఇవే.. మొదటి పని ? ఫ్లైటు టికెట్ బుక్ చేయడం! రెండో పని ? ఢిల్లీకి పోవడం! మూడో పని ? ఖాళీ చేతులతో తిరిగి రావడం! అని కేటీఆర్ పేర్కొన్నారు. రైతన్నలు ఇబ్బందులను తట్టుకుని పండించిన పంటలకు మార్కెట్లో మద్దతు ధర లేదు.. రైతులు పొలాల్లో జల్లడానికి యూరియా లేదు.. సాగునీళ్లు రావు.. తాగునీళ్లు లేవు.. కాళేశ్వరం ఎత్తిపోతల మరమ్మతు పనులు జరగకుండా అడ్డుకుంటూ తెలంగాణకు ద్రోహం చేస్తున్నామన్న సోయి లేదు. బనకచర్ల నిర్మాణంతో తెలంగాణ శాశ్వతంగా నష్టపోతుందన్న ఆలోచన లేదు అని రేవంత్ రెడ్డిపై కేటీఆర్ మండిపడ్డారు.రెండు లక్షల ఉద్యోగాల ఊసు లేదు.. జాబ్ క్యాలెండర్ల జాడ లేదు. రుణమాఫీ కాలేదు ? రైతు భరోసా రాలేదు. తులం బంగారం ఊసు లేదు.. రూ.4 వేల ఫించన్ జాడ లేదు. గురుకులాల గోడు పట్టదు ? గురుకుల విద్యార్థుల ఆకలి కేకలు వినపడడం లేదు. కానీ రేవంత్ రెడ్డి 3 రోజుల్లో 3 ఫ్లైట్లు ఎక్కుతున్నాడు.. దిగుతున్నాడు. "ఒక్కసారి కాదు.. రెండు సార్లు కాదు.. 50 సార్లకు చేరిన హస్తిన యాత్ర. కానీ తెచ్చింది ఏమీ లేదు! శుష్కప్రియాలు.. శూన్య హస్తాలు. అయిననూ పోయి రావలె హస్తినకు అని పేర్కొంటూ రేవంత్‌పై కేటీఆర్ ధ్వజమెత్తారు. కానీ ఢిల్లీ యాత్రలతో మన రాష్ట్రానికి వచ్చిందేమిటి?? నో ప్రాజెక్ట్, నో ఫండింగ్, నో ప్యాకేజీ.. దానికి బదులు దక్కింది మాత్రం? ఫోటో షూట్లు, వీడియోలు. విందు రాజకీయాలు! అని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని పాలించే ముఖ్యమంత్రి కావాలి. ఢిల్లీకి యాత్రలు చేసే టూరిస్ట్ సీఎం కాదు! అని కేటీఆర్ ఘాటుగా వ్యాఖ్యానించారు.

# గద్దర్ వర్ధంతిని జయప్రదం చేయండి : పి.శంకర్



హైదరాబాద్, ఆగష్టు 2: ప్రజా యుద్ధ నౌక గద్దర్ రెండవ వర్ధంతి సభను జయప్రదం చేయాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ పిలుపునిచ్చారు.

ఆగస్టు 6 హైదరాబాద్‌లోని రవింద్రభారతిలో నిర్వహిస్తున్న వర్ధంతి సభ వాల్ పోస్టర్‌ను శనివారం రాయపోల్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. పిడిత ప్రజల విముక్తి కోసం గద్దరన్న జీవితాంతం పోరాడారని గుర్తుచేశారు. గద్దర్ ఫౌండేషన్ అధ్వర్యంలో గద్దరన్న రెండవ వర్ధంతి సభను నిర్వహిస్తున్నారన్నారు. ఈ సభకు కళాకారులు, ప్రజాసంఘాల నాయకులు ప్రజలు తరలిరావాలని కోరారు. రవీంద్రభారతిలో అగస్టు 6న మధ్యాహ్నం 2 గంటల నుండి రాత్రి వరకు కొనసాగుతదని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ జిల్లా కార్యదర్శి బ్యాగరి వేణు, ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సమ్మిళిత, స్థిరమైన వృద్ధుల సంరక్షణ కోసం 'భారతదేశంలో వృద్ధాప్యం: సవాళ్లు మరియు అవకాశాలు' అనే నివేదికను విడుదల చేసిన నిపుణులు




న్యూఢిల్లీ, ఆగష్టు 2:జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఔఊఖీఅ), భారతదేశం ఔమిఎ ఆయోగ్, కేంద్ర సామాజిక న్యాయం ఉ సాధికారత మరియు ఆరోగ్యం ఉ కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖలతో భాగస్వామ్యంతో ఆగస్టు 1, 2025న న్యూఢిల్లీలో జరిగిన 'భారతదేశంలో వృద్ధాప్యం: ఉద్భవిస్తున్న వాస్తవికతలు, అభివృద్ధి చెందుతున్న ప్రతిస్పందనలు' అనే అంశంపై ఒక రోజంతా జాతీయ సదస్సును నిర్వహించడంలో సంకల ఫౌండేషన్‌కు మద్దతు ఇచ్చింది. ఈ సమావేశం సీనియర్ సిటిజన్ల మానవ హక్కులు మరియు గౌరవాన్ని రక్షించడం మరియు వృద్ధాప్యాన్ని ఒక అవకాశంగా పునర్నిర్వచించడంపై దృష్టి సారించింది. భారతదేశంలో వృద్ధాప్య జనాభా యొక్క అభివృద్ధి చెందుతున్న సవాళ్లు మరియు అవకాశాలకు ప్రతిస్పందనగా వినూత్న విధానాలను ప్రోత్సహించడం, వాటాదారుల సంభాషణను ప్రోత్సహించడం మరియు స్కేలబుల్ ఉత్తమ పద్ధతులను హైలైట్ చేయడం దీని లక్ష్యం.

NHRC చైర్‌పర్సన్, జస్టిస్ శ్రీ వి. రామసుబ్రమణియన్ తన ప్రారంభోపన్యాసంలో మాట్లాడుతూ, భారతదేశం వృద్ధుల పట్ల శ్రద్ధ మరియు గౌరవాన్ని ప్రాథమిక సామాజిక విలువగా సమర్థించే గొప్ప సాంస్కృతిక సంప్రదాయాన్ని కలిగి ఉందని అన్నారు. ఈ సందర్భంలో, ఆయన సంగం సాహిత్యం మరియు యజుర్వేదం నుండి కూడా ప్రస్తావించారు. మానవ హక్కులను కాపాడాలనే ఔఊఖీఅ ఆదేశానికి అనుగుణంగా, సీనియర్ పౌరుల గౌరవం, రక్షణ మరియు శ్రేయస్సును నిర్ధారించడానికి ఈ పురాతన విలువలు మరియు సూత్రాలను ఆధునిక విధాన చట్రాలలో ఏకీకృతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. వృద్ధుల హక్కులను పరిరక్షించడంలో కమిషన్ నిబద్ధతను నొక్కి చెబుతూ, సలహాలు, కోర్ గ్రూప్ సమావేశాలు, పరిశోధన అధ్యయనాలు మరియు సుమోటో కాగ్నిజెన్స్ కేసులు వంటి దాని వివిధ కార్యక్రమాలను ఆయన హైలైట్ చేశారు.

తన ప్రత్యేక ప్రసంగంలో, ఔమిఎ ఆయోగ్ సభ్యుడు (ఆరోగ్యం, పోషకాహారం మరియు విద్య) డాక్టర్ వినోద్ కె. పాల్, వృద్ధాప్య జనాభాకు ఆరోగ్య సంరక్షణ మరియు సామాజిక భద్రతా చట్రాల ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. వృద్ధులను జాగ్రత్తగా చూసుకోవడానికి కుటుంబాలకు అధికారం ఇవ్వడం భారతదేశ విధానానికి పునాదిగా ఉండాలని ఆయన అన్నారు.

# పట్టణ పరిశుభ్రతలో కార్మికుల సేవలు వెలకట్టలేనివి : ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

హైదరాబాద్, ఆగష్టు 2: షాద్‌నగర్ పట్టణ పరిశుభ్రతలో మున్సిపల్ కార్మికుల సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ కార్మికులకు మున్సిపల్ కమిషనర్ సునీతారెడ్డి, నాయకులతో కలిసి యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి రోజూ పట్టణాన్ని శుభ్రంగా ఉండేలా శ్రమిస్తున్న కార్మికులను అభినందించారు. మున్సిపాలిటీలోని ప్రతి వార్డును పరిశుభ్రంగా మార్చడంలో కార్మికుల పాత్ర మరువలేనిదన్నారు.

పట్టణాన్ని శుభ్రం చేసే మున్సిపల్ కార్మికులకు ప్రజలందరూ సహకరించాలన్నారు. అదే విధంగా మున్సిపాలిటీలోని 9వ వార్డు మల్లికార్జునకాలనీ పార్క్ అభివృద్ధి పనులను ప్రారంభించారు. పార్కుల అభివృద్ధితో కాలనీలో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంటుందన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో విద్యుత్ సమస్యల పరిష్కరించేందుకు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో పాల్గొని సమస్యలను తెలుసుకున్నారు.

# పొలంలో దిగి వరినాట్లు వేసిన ఏపీ హోంమంత్రి



అమరావతి, ఆగష్టు 2:ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత పొలంలో దిగి వరి నాట్లు వేశారు. విజయనగరం జిల్లా గజపతినగరం మార్కెట్ యార్డులో నిర్వహించిన అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ తొలి విడత నిధుల పంపిణీ కార్యక్రమానికి అనిత వెళ్లారు. ఈ సందర్భంగా మార్గమధ్యలో పురిటిపెంట, మధుపాడ సరిహద్దుల్లోని పొలంలో దిగి వరినాట్లు వేశారు. అనంతరం రైతులు, వ్యవసాయ కూలీలతో మాట్లాడి కష్టసుఖాలు అడిగి తెలుసుకున్నారు.

అనంతరం గజపతినరంలో అన్నదాత సుఖీభవ నిధుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ సీఎం వైఎస్ జగన్‌పై విమర్శలు గుప్పించారు. పొగాకు రైతుల దగ్గరికి వెళ్లిన జగన్. కేజీకి, టన్నుకు తేడా తెలియకుండా మాట్లాడుతున్నాడని ఎద్దేవా చేశారు. రాజకీయం చేసేందుకు వైసీపీ నాయకులు వ్యవసాయాన్ని అడ్డుపెట్టుకున్నారని ఆరోపించారు. రైతుల విషయంలో రాజకీయం చేయరాదని హితవుపలికారు. కూటమి ప్రభుత్వం రైతు కుటుంబాలకు మేలు చేసే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తే ఉద్దేశపూర్వకంగా అడ్డుతగులుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

వ్యవసాయం అంటే చంద్రబాబుకు చాలా ఇష్టమని వంగలపూడి అనిత అన్నారు. రీసర్వేలో రైతుల ఇబ్బందులు తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతన్నలు సాంకేతికతను వినియోగించుకోవాలని, ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ముందుకు రావాలని కోరారు.

